



## కాగితంతో కళాఖండాలు

- ప్రపంచ గుర్తింపు పొందిన గోపాలపట్నం వాసి మూకా సతీశ్‌కుమార్
- ఒక్కోచిత్రం ఖరీదు రూ.లక్షల్లోనే...

- 8లో



# మెగా వాటర్ ప్రాజెక్టులో కదలిక



ఉద్దండపురం వద్ద భారీ వాటర్ స్టోరేజీ ట్యాంకు, పంప్ హౌస్

పనులు పునఃప్రారంభానికి మంత్రి అనిత చర్యలు

- తొలుత రూ.24 కోట్లతో 'పేట మండలంలో 15 గ్రామాలకు తాగునీరు
- పైపులైన్ల పనులు ప్రారంభం
- మిగిలిన పనులకు నిధులివ్వాలని డిప్యూటీ సీఎంను కోరతానని మంత్రి అనిత వెల్లడి
- 2016లో టీడీపీ హయాంలోనే వాటర్ ప్రాజెక్టుకు శ్రీకారం
- రూ.71 కోట్లతో మొదటి దశ పనులు పూర్తి
- రెండో దశ పనులు చేపట్టేలోపు అధికారంలోకి వైసీపీ
- ఐదేళ్లపాటు ప్రాజెక్టును అటకెక్కించిన పాలకులు
- కూటమి ప్రభుత్వం రావడంతో పనుల్లో కదలిక
- తీరనున్న తాగునీటి సమస్య

నక్కపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సమస్యను శాశ్వతంగా తొలగించడానికి ఎనిమిదేళ్ల క్రితం టీడీపీ హయాంలో చేపట్టిన ఉద్దండపురం మెగా వాటర్ ప్రాజెక్టు పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నంత కాలం ఈ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగి, నక్కపల్లి మండలంలో ఎనిమిది గ్రామాలకు తాగునీటి సరఫరా కూడా ప్రారంభమైంది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఈ ప్రాజెక్టును అటకెక్కించారు. ఐదేళ్ల కాలంలో ఒక అడుగు కూడా ముందుకు కదల్లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారంలోకి రావడంతోపాటు స్థానిక ఎమ్మెల్యే వంగలపూడి అనిత మంత్రి కూడా కావడంతో మెగా వాటర్ ప్రాజెక్టు పనులకు మోక్షం లభించింది. తొలుత జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీ) నుంచి మంజూరైన నిధులతో పాయకరావుపేట మండలంలో 15 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం పనులు ప్రారంభించనున్నారు. అనంతరం దశలవారీగా మిగిలిన గ్రామాలకు కూడా తాగునీటిని అందిస్తారు.



పాయకరావుపేట మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం సిద్ధం చేసిన పైపులు

పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో 53 పంచాయతీల పరిధిలోని 93 గ్రామాలకు చెందిన దాదాపు 1.7 లక్షల మందికి రక్షిత తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో 2016లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నాటి ఎమ్మెల్యే వంగలపూడి అనిత మెగా వాటర్ ప్రాజెక్టును మంజూరు చేయించారు. రోజూ లక్షలాది లీటర్ల నీరు అవసరం కావడంతో ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకోవాలని ప్రణాళికను రూపొందించారు. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల సరిహద్దులోని ఉద్దండపురం పరిధి గోపాలపట్నం ఆవ ప్రాంతంలో రిజర్వాయర్, పంప్ హౌస్, ఫిల్టర్ బెడ్లు, ట్యాంకుల నిర్మాణంతోపాటు నాతవరం మండలం శరభవరం వద్ద ఏలేరు కాలువపై లిఫ్ట్ మోటార్లు ఏర్పాటు చేసి, పైపులైన్ల ద్వారా ఉద్దండపురం రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేయాలి. తొలి దశలో జాతీయ గ్రామీణ తాగునీటి పథకం నిధులు రూ.71 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ప్రాజెక్టు వద్ద 10 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంగల ఓవర్ హెడ్ ట్యాంకు, వెయ్యి కిలో లీటర్ల సామర్థ్యంగల సంప్, నీటిని శుద్ధి చేసేందుకు రాపిడ్ శాండ్ ఫిల్టర్, పంప్ హౌస్, ఏరియేటర్, క్లారిఫ్లోక్యూటర్ వంటి నిర్మాణాలు చేపట్టారు. దాదాపు 5.5 మీటర్ల లోతుతో 70 ఎకరాల్లో స్టోరేజీ ట్యాంకు నిర్మించారు. ఇదే సమయంలో మూడు మండలాల్లో 53 పంచాయతీల పరిధిలో 93 గ్రామాలకు తాగునీటి సరఫరాకు 'వాటర్ గ్రిడ్' పేరుతో పైపులైన్ల నిర్మాణం, ఇతర పనుల కోసం 2018లో ప్రభుత్వం మరో రూ.97 కోట్లు మంజూరు చేసింది. మొదటి దశ పనులు 2018 డిసెంబరునాటికి పూర్తికావడంతో ఉద్దండపురం రిజర్వాయర్‌కు చుట్టుపక్కల వున్న నక్కపల్లి మండలంలో డొంకాడ, జి.జగన్నాథపురం, డొంకాడ కొత్తూరు, గొడిచెర్ల కొత్తూరు, సేరి కొత్తూరు, ఉద్దండపురం, వేంపాడు కొత్తూరు గ్రామాలకు ... మిగతా 8వ పేజీలో

# భూముల రీసర్వే అక్రమాల పుట్ట

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా సర్వే

- రెవెన్యూ గ్రామ సభల్లో వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- వైసీపీ నేతలతో నాటి సర్వే సిబ్బంది కుమ్మక్కు
- తమ భూముల విస్తీర్ణాన్ని తగ్గించారని పలువురు రైతులు ఆరోపణ
- పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పుల తడకలు
- వారం రోజుల్లో రైతుల నుంచి 4,847 ఫిర్యాదులు
- న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు



నర్సీపట్నం మండలం గబ్బాడలో నిర్వహించిన గ్రామ సభలో అర్జీలు అందజేస్తున్న రైతులు (ఫైల్)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**ఐదేళ్ల పాలనలో వైసీపీ నేతలు అడ్డగోలుగా సాగించిన భూదందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. భూముల రీసర్వే ముసుగులో జరిగిన అక్రమాలపై బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ హయాంలో నిర్వహించిన భూ సర్వే వల్ల నష్టపోయిన వారికి న్యాయం చేయడానికి కూటమి ప్రభుత్వం గత వారం రోజుల నుంచి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రీసర్వే భూ సమస్యల పరిష్కార గ్రామ సభ'లకు రైతులు భారీగా హాజరవుతూ పెద్ద ఎత్తున ఫిర్యాదులు, అర్జీలు అందజేస్తున్నారు.**

అనకాపల్లి జిల్లాలో 753 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం 455 గ్రామాల్లో భూములను రీసర్వే చేయించింది. అయితే ఈ సందర్భంగా స్థానిక వైసీపీ నాయకులు పలువురు, సర్వే సిబ్బందితో కుమ్మక్కై, పలు రకాల ప్రభుత్వ భూములను తమ సాగులో వున్నట్టు రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నారు. అంతేకాక పక్కనున్న రైతుల జిరాయితీ భూముల్లో వాస్తవ విస్తీర్ణం కన్నా తక్కువ చూపించి, మిగిలిన భూమిని తమ పొలంలో కలిపేసుకున్నారు. సర్వే తరువాత అధికారులు ప్రకటించిన భూముల వివరాల్లో ఈ అక్రమాలు బయటపడడంతో బాధిత రైతులు ఆందోళన చెందారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయితే వైసీపీ నేతల ఒత్తిళ్లతో రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ ప్రభుత్వం గతంలో చేపట్టిన రీసర్వేను రద్దు చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి 'రీసర్వే భూ సమస్యల పరిష్కార గ్రామ సభ'లను నిర్వహిస్తున్నది. గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. వైసీపీ నేతల భూ అక్రమాలను మౌఖికంగా అధికారుల దృష్టికి తీసుకురావడమే కాకుండా ఫిర్యాదులను రాతపూర్వకంగా అందిస్తున్నారు. జిల్లాలో బుధవారంనాటికి 115 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,991, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో 1,854.. మొత్తం జిల్లాలో 4,847 ఫిర్యాదులు అందాయి. రోజూ సగటున 700లకుపైగా ఫిర్యాదులు అందుతు న్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో అందుతున్న ఫిర్యాదులను చూస్తే వైసీపీ నేతలు రీసర్వే పేరుతో ఏ స్థాయిలో భూ అక్రమాలకు తెగబడ్డారో స్పష్టమవుతున్నది.

వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, తమ భూముల విస్తీర్ణాన్ని తక్కువ చూపించి, మిగతా భూమిని లాగేసుకున్నారని కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. భూహక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని చెప్పినా పట్టించుకోకుండా తమ భూమిని వేరొకరి పేరున రికార్డుల్లో నమోదు చేశారని ఫిర్యాదు చేస్తున్నారు. భూ యజమానుల సమక్షంలో సర్వే జరపాల్సి ఉండగా, వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకుని వారికి అనుకూలంగా సర్వే చేయించుకున్నారని, భూముల హద్దులను మార్చేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రీసర్వే పూర్తిచేసిన గ్రామాల్లో రైతులకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారు. వీటిల్లో సర్వే నంబర్లు, ఇంటి పేర్లు, భూ యజమాని పేర్లను తప్పుగా నమోదు చేశారని, వాటిని సరిదిద్దాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని పలువురు భూ యజమానులు రెవెన్యూ సదస్సుల్లో తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. కాగా నవంబరు 25వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, గ్రామ సభల్లో అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి భూ యజమానులకు న్యాయం చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి తెలిపారు.

# వరిపై తెగుళ్ల దాడి

## రైతులు తీవ్ర ఆందోళన

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయ అధికారులు
- మోతాదుకు మించి యూరియా వాడితే చీడపీడలకు ఆస్కారం
- తెగుళ్ల నివారణకు పలు సూచనలు





అంతకాపల్లిలో తెగులు సోకిన వరి పైరు (ఇన్‌సెట్‌లో) తెగులు సోకిన వరి పైరుకు మందు పిచికారీ చేస్తున్న రైతు

సబ్బవరం, అక్టోబరు 23: మండలంలోని పలు గ్రామాల్లో వరిపైరుపై తెగుళ్ల దాడి చేస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో చేతికి అందివచ్చే పంటను, చీడపీడలు నాశనం చేస్తుండడంతో అన్నదాతలు తీవ్ర అందోళన చెందుతున్నారు. ప్రధానంగా అంతకాపల్లి, రావలమ్మపాలెం, గొర్లివానిపాలెం, గుల్లేపల్లి, వంగలి, మొగలిపురం, మలునాయుడుపాలెం, అమృతపురం, పెదనాయుడుపాలెం, అసకపల్లి, గొల్లలపాలెం, నారపాడు గ్రామాల్లో తెగుళ్ల బెడద అధికంగా వుంది. రైతుల నుంచి సమాచారం అందుకున్న మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ గ్రామాల్లో పర్యటిస్తూ, తెగుళ్లను పరిశీలిస్తున్నారు. ఆకుముడత, పాము పొడ, తెల్లచిత్త తెగుళ్లు సోకినట్టు గుర్తించారు. నివారణ కోసం రైతులు సలహాలు సూచనలు అందిస్తున్నారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే చీడ పీడలు, తెగుళ్లను సరమర్థంగా ఎదుర్కొనవచ్చని ఆయన చెప్పారు. యూరియాను మోతాదుకు మించి వినియోగించడం వల్ల పంట ఏపుగా పెరుగుతుందని, కానీ ఇదే సమయంలో తెగుళ్లను ఆకర్షిస్తుందని, అందువల్ల అవసరం మేరకే యూ రియాను వేయాలని సూచించారు. వరికి సోకిన తెగుళ్లు, నివారణ చర్యల గురించి ఆయన అందించిన వివరాలు..

**అకు ముడత తెగులు:** ఈ తెగులు నివారణకు క్లోరీఫైరీఫాస్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పొడి మందును రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**పాము పొడ తెగులు:** ఈ తెగులు నివారణ కోసం లీటరు నీటికి హెక్సాకోనజోల్ మందును రెండు మిల్లీలీటర్లు, లేదా ప్రొఫికోనజోల్ ... మిగతా 8వ పేజీలో

# సైబర్ మోసగాళ్ల ఉచ్చులో గృహిణి

- రకరకాల బోనస్‌ల పేరుతో రూ.3.79 లక్షలు లూటీ

నర్సీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలంపేట గ్రామానికి చెందిన ఓ గృహిణి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని రూ.3.79 లక్షలు పోగొట్టుకుంది. రూరల్ సీఐ రేవతమ్మ అందించిన వివరాలిలా ఉన్నాయి. నీలంపేటకు చెందిన మాకిరెడ్డి కల్పన పదో తరగతి వరకు చదువుకుంది. ఆన్‌లైన్ జాబ్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేసింది. ఆమె ఫోన్‌కి షేర్ చాట్ యాప్ లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేసిన వెంటనే సైబర్ నేరగాళ్లు ఆమె ఫోన్ నంబరును టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. రోల్డ్ గోల్డ్ ఆభరణాల ఫొటోలు పెట్టి, స్క్రీన్ షాట్ తీసి పెట్టమన్నారు. వారు చెప్పినట్టు ఆభరణాలు స్క్రీన్ షాట్ తీసి పెట్టింది. ఆమె ఖాతాకి రూ.130 జమ చేశారు. దీంతో మరో పది స్క్రీన్ షాట్స్ తీసి గ్రూపులో షేర్ చేసింది. ఆమె ఖాతాకు రూ.200 పంపారు. తర్వాత ఆమెకు మరో బ్యాంక్ ఖాతా నంబర్ ఇచ్చి రూ.1,000 పంపితే బోనస్‌తో కలిపి పంపుతామని మెసేజ్ పెట్టారు. వాళ్లు చెప్పినట్టు ఆమె రూ.1,000 పంపించింది. దీంతో ఆమె ఖాతాకు రూ.1,300 జమ అయ్యాయి. మరో బ్యాంకు ఖాతా నంబరు ఇచ్చి రూ.20 వేలు పంపమన్నారు. దీంతో ఆమె డబ్బులు పంపించింది. తర్వాత రూ.50 వేలు, రూ.80 వేలు చొప్పున ... మిగతా 8వ పేజీలో

# కానరాని సమస్యల పరిష్కారం

- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
- అసలు అధికారులు పట్టించుకోవడం లేదంటున్న సభ్యులు
- సమావేశం జరిగే తీరు మారాలనే అభిప్రాయం
- జిల్లాలో రహదారుల దుస్థితి, ఇసుక సరఫరా, ఖరీఫ్‌కు నీటి విడుదల వంటి అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి



విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):

**జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పాటై మూడేళ్లు అయ్యింది. మూడు నెలలకొకసారి నిర్వహించే సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చే సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలు విడిపోయిన తరువాత మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు జిల్లా పరిషత్ సమావేశానికి హాజరవుతున్నారు. ప్రతి సమావేశంలో ఐదారు శాఖలపై గంటలకొద్దీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రయోజనం మాత్రం ఉండడం లేదనే వ్యాఖ్యలు సభ్యుల నుంచి వినిపిస్తున్నాయి.**

వ్యవసాయం, విద్య, వైద్యం, డ్వామా, పంచాయతీరాజ్, హౌసింగ్, డీఆర్‌డీఏ, పౌరసరఫరాలు, పశు సంవర్థక, గనులు, రవాణా వంటి శాఖలు తప్ప కొన్ని శాఖలపై ఇప్పటివరకూ అసలు చర్చే చేపట్టలేదు. ఒకటి, రెండు పర్యాయాలు అటవీ శాఖపై ఏజెన్సీ ప్రజాప్రతినిధులు విరుచుకుపడ్డారు. అయినా ఫలితం శూన్యం. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సమావేశం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన విరామం తరువాత చాలా మంది సభ్యులు ఇంటి ముఖం పడుతున్నారు.

అసలు సమావేశం నిర్వహణకు సరైన విధంగా కసరత్తు చేయడం లేదనే వాదన ఉంది. సాధారణంగా ముందు షాడో సమావేశం నిర్వహించి ప్రతిసారి కొత్త అంశాలపై చర్చించేలా నిర్ణయం తీసుకోవాలి. ఒకే అంశంపై సభ్యులంతా మాట్లాడే కంటే అంశాల వారీగా సభ్యులు సమస్యలు లేవనెత్తితే సమయం ఆదా అవుతుంది. అయితే ఆ దిశగా చొరవ చూపడం లేదని కొందరు సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే ఒకసారి లేవనెత్తిన సమస్యలు మరోసారి ప్రస్తావనకు రాకుండా పరిష్కరించాలన్న ఆలోచన అధికార యంత్రాంగంలో కూడా కనిపించడం లేదు. గ్రామీణ, ఏజెన్సీలో ఇళ్ల నిర్మాణాల బిల్లులు మంజూరుపై దాదాపు రెండేళ్ల నుంచి సభ్యులు అడుగుతున్నా పరిష్కారం లభించడం లేదు. అలాగే ఏజెన్సీలో విద్య, వైద్య సదుపాయాలు, హాస్టళ్లు, విత్తనాలు సరఫరా, తదితర సమస్యలను ప్రతిసారి సభ్యులు ప్రస్తావిస్తున్నా ఫలితం ... మిగతా 8వ పేజీలో

# నకిలీ వరి విత్తనాలతో నష్టపోయాం

## కోటవురట్ల మండల రైతులు ఆందోళన

- ఆర్‌జేఎల్ రకంలో కేళీలు
- ఆర్‌బీకేలో కొనుగోలు చేసినట్టు వెల్లడి

కోటవురట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవరపేట, జానకిరామపురం, రాజుపేట, కోటవురట్ల గ్రామాలకు చెందిన పలువురు రైతులు నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయారు. రైతు భరోసా కేంద్రాల నుంచి ఆర్‌జేఎల్ రకం వరి విత్తనాలు కొనుగోలు చేసి, జూలై మొదటి వారం నాట్లువేశారు. అక్టోబరు చివరి వారంలో పొలంలో అత్యధికంగా కేళీల మొక్కలు (ఎర్ర రంగు బియ్యంతో తక్కువ దిగుబడి వచ్చే రకం) కనిపించడంతో మోసపోయామని ... మిగతా 8వ పేజీలో



నకిలీ వరి విత్తనాలతో మోసపోయామంటున్న కోటవురట్ల రైతులు

# ఆటోను ఢీకొన్న ట్రాక్టర్ ఇద్దరి మృతి

- అనకాపల్లి నుంచి సొంతూరు సింగవరం వెళుతుండగా వెంకన్నపాలెం వద్ద ప్రమాదం



ఆటో డ్రైవర్ దాడి రాము (ఫైల్ ఫొటో)



శరగడం పూర్ణచంద్రరావు (ఫైల్ ఫొటో)

చోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. వీరంతా చీడికాడ మండలం సింగవరం గ్రామానికి చెందిన వారు. ఆటోలో అనకాపల్లి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. చోడవరం సీఐ పి.అప్పలరాజు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

చీడికాడ మండలం సింగవరం గ్రామానికి చెందిన దాడి రాముకు చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన కొంతమంది మంగళవారం అనకాపల్లి వచ్చారు. ఇక్కడ పనులు ముగించుకుని తరువాత రాత్రి పదిన్నర గంటల సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. చోడవరం వెంకన్నపాలెం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోను డ్రైవర్ దాడి రాము(33) అక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న శరగడం పూర్ణచంద్రరావు, శరగడం లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో పూర్ణచంద్రరావు (35) మృతిచెందాడు. దాడి రాము ఆటో నడుపుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటునాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. పూర్ణచంద్రరావు వ్యవసాయదారుడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు మృతిచెందడంతో సింగవరంలో విషాదం నెలకొంది. మృతదేహాలకు బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పలరాజు తెలిపారు.



## రాంబిల్లి కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

- వసతులు, విద్యాబోధన, మెనూ తదితరాలపై ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి విజయ ఆరా
- విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి సూచనలు



కేజీబీవీలో విద్యార్థినుల గదులను పరిశీలిస్తున్న జడ్జి విజయ

రాంబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ) : మండల కేంద్రం రాంబిల్లిలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల గదులు, స్టోర్ రూమ్, రోజువారీ అందించే ఆహారం తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలల విద్యాబోధన, సదుపాయాలపై ఆరా తీశారు. విద్యాలయం ప్రత్యేకాధికారిణితో పాటు ఉపాధ్యాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'విద్యా, వసతి దీవెన' కోసం ఆందోళన

- గత వైసీపీ ప్రభుత్వం చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు
- పలు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు
- విద్యార్థులు ఆవేదన
- ఎలమంచిలిలో పెద్ద ఎత్తున నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వివిధ కళాశాలల విద్యార్థులు

ఎలమంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు గత వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించిన బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పట్టణంలో పెద్ద ఎత్తున విద్యార్థులు బుధవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వారంతా కళాశాలల్లో స్వచ్ఛందంగా తరగతులను బహిష్కరించి, ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద ర్యాలీ, మానవహారం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవ, కె.మణికంఠ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కళాశాలల విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన పథకాలకు సంబంధించిన నగదును చెల్లించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కారణంగా పలు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పలువురు విద్యార్థులు వాపోయారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను చెల్లించాల్సిందిగా వారంతా కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు శరణ్య, జాహ్నవి, సంధ్య, రత్నం, భవానీ, రవి, రాము, లక్ష్మణ్, బాలు, దాసు తదితరులతో పాటు పెద్దసంఖ్యలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నాగులాపల్లి గ్రోయిన్‌ను అభివృద్ధి చేయండి'




గ్రోయిన్‌పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారి తదితరులు

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగులాపల్లి గ్రోయిన్‌ను అభివృద్ధి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు కోరారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం ఆ పార్టీ నాయకులు సదరు గ్రోయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులాపల్లి గ్రోయిన్ కింద దాదాపుగా పదివేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారన్నారు. గ్రోయిన్ మరమ్మతులకు గురికావడంతో పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రోయిన్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. తక్షణమే నాగులాపల్లి గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని విన్నవించారు.

## 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తాం

- సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు హెచ్చరిక



పాలకేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న పాడి రైతులు

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను తగ్గించి రైతుల ఆదాయాన్ని గండి కొట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామని సీఐటీయూ నాయకుడు వీవీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పాడి రైతులతో కలిసి గురువారం తోటాడ విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్ధాంతరంగా ఆవు పాల సేకరణ ధరను తగ్గించి రైతులపై భారం మోపడం అన్యాయమన్నారు. ఇప్పటికే పాడి రైతులకు ఇవ్వాల్సిన బోనస్‌లను ఎగ్గొట్టారని ఆరోపించారు. తక్షణమే విశాఖ డెయిరీ నిర్ణయాన్ని మార్చుకుని పాడి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, కాండ్రేగుల రామ సూరిఅప్పారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు 'కైట్స్' విద్యార్థులు



అచ్యుతాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా నరపాల నేతాజీ పాఠశాలలో ఈనెల 19 నుంచి 21 వరకు జరిగిన 43వ అంతర్ జిల్లాల సీని యర్ ఇంటర్ చాంపియన్ షిప్ పోటీల్లో కైట్స్ కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభ చూపారు. దీంతో ఖోఖోలో అడిగర్ల జాగృతి, షూటింగ్ బాల్‌లో చైతన్య, దక్షిత్‌లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు వాసు అర్హత సాధించాడు. వీరిని కరస్పాండెంట్ రెడ్డి గణేశ్‌తో పాటు, పీడీ శివాజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యుత్ శాఖా మంత్రి దృష్టికి 'అభిజిత్' సమస్య

- కర్మాగారం పరిస్థితిని వివరించిన ఎమ్మెల్యే 'సుందరపు'
- పునః ప్రారంభించేలా చర్యలకు వినతి



మంత్రి రవికుమార్‌కు వినతిని అందిస్తున్న ఎమ్మెల్యే

చ్యుతాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సెజ్‌లో గల అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం సమస్య పరిష్కరించాలని కోరుతూ ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. విద్యుత్‌బకాయిలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఫెర్రో ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గిపోవడం తదితర కారణాలతో కర్మాగారంలో ఈనెల 14 నుంచి లేఆఫ్ ప్రకటించారన్నారు. ఈ కారణంగా సుమారు మూడు వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి కర్మాగారం పునఃప్రారంభించేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ఇక్కడి విలేకరులకు వివరించారు.

### లాకౌట్ ఎత్తివేయాలని ధర్నా

రాంబిల్లి : అభిజిత్ కర్మాగారం యాజమాన్యం అక్రమ లాకౌట్ ప్రకటించిందని, వెంటనే ఎత్తివేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవానం ఇక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు మాట్లాడుతూ అభిజిత్ కర్మాగారం మూసి వేతతో సుమారు వెయ్యి మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అక్రమంగా లాకౌట్ విధించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు సంస్థను తెలరించేలా చర్యలు చేపట్టాల్సిందిగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న, నూకరాజు, నారాయణరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




అభిజిత్‌ను తెరిపించాలని నినాదాలు చేస్తున్న సీఐటీయూ శ్రేణులు

## వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు

- రైతులకు సూచించిన వ్యవసాయాధికారులు
- రబీకి విత్తనాలు సిద్ధం చేస్తున్నామని వెల్లడి





మామిడివాడలో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత, కొత్తపాలెంలో సూచనలిస్తున్న ఏవో

రాంబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ) : వరి పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్ర ఏవో పి.విజేత అన్నారు. మండలంలోని మామిడివాడలో ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం వరి పంటను ఆశించిన చీడపీడలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో ఆకుముడత, సుడిదోమ, పొడ తెగులు, పోటాష్ లోపాలను గుర్తించామన్నారు. వీటి నివారణకు సిఫార్సు చేసిన మందులను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌కు అవసరమైన వరి, అపరాల విత్తనాలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. మామిడివాడ సర్పంచ్ ఎం.అప్పలనర్స, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిరావు, రైతులు, పాల్గొన్నారు.

ఎలమంచిలి : మునిసిపాలిటీ పరిధిలోని కొత్తపాలెంలో వ్యవసాయాధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

### కొబ్బరిలో తెల్లదోమల నివారణకు సూచనలు

రాంబిల్లి కొబ్బరి పంటలో నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యాన అధికారిణి సాయిప్రియ తెలిపారు. పల్లె పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రాంబిల్లి, జడ్. చింతువా గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాల్లో బుధవారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొబ్బరి పంట గురించి తెలుసుకున్నారు. కొబ్బరిలో అంతర పంటల సాగు ద్వారా లాభాలు పొందవచ్చునన్నారు. రాంబిల్లి మండలంలో ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం ద్వారా అందే రాయితీ వివరాలను తెలిపారు. సూక్ష్మ సేద్యం పథకంలో రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్ల కొరకు రైతులు దరఖాస్తులుచేసుకోవాలని కోరారు.

### బార్క్‌ను సందర్శించిన ఆర్డీవో ఆయిషా

అచ్యుతాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)ను అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా బుధవారం సందర్శించారు. తొలుత ఆమె మండలంలో పరిస్థితులను తెలుసుకునేందుకు విచ్చేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ ద్వారా అన్ని వివరాలు తెలుసుకున్నారు. పూడిమడక తీరంలో ఫిషింగ్ హార్బర్, రోడ్ల పరిస్థితి తదితరాలపై ఆరా తీశారు. అనంతరం బార్క్‌ను సందర్శించారు. సంస్థ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.



ఏపీఐఐసీ భూముల రికార్డులు పరిశీలిస్తున్న జేసీ జాహ్నవి

## ఏపీఐఐసీ భూములను పరిశీలించిన జేసీ

నక్కపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి బుధవారం పరిశీలించారు. నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ, ఏపీఐఐసీ అధికారులు కారిడార్ భూముల భౌగోళిక పరిస్థితులకు సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. నిర్వాసిత రైతుల సమస్యలు, పరిహారం, ప్యాకేజీ తదితర అంశాలపై జేసీ ఆరా తీశారు. తహసీల్దార్ నరసింహమూర్తి, డీటీ కన్నబాబు పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రామసభలను వినియోగించుకోండి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. మండలంలోని మంగవరం గ్రామంలో నిర్వహించిన రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామ సభలో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఏమైనా తప్పులు ఉంటే విచారణ జరిపి వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వైస్ సర్పంచ్ శ్రీను, టీడీపీ జనసేన, వైసీపీ నాయకులు కోనే కొండబాబు, కట్టా దొర, వంగలపూడి రామారావు, రైతులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చినదొడ్డిగల్లు జడ్పీహెచ్ పాఠశాలలో రవీంద్రనాథ్‌ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకటరమణ మాస్టారు ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సొంత నిధులతో స్టడీ మెటీరియల్ కొనుగోలు చేసి అందజేశారు. హెచ్ఎం కవిత సమక్షంలో బుధవారం స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని ఈ సందర్భంగా వెంకటరమణ మాస్టారు చెప్పారు.

## ఏడు మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- వచ్చే నెల 10న ఓటర్ల జాబితా ప్రకటన
- 19వ తేదీ వరకు తప్పుల సవరణలు... తుది జాబితా ప్రకటన
- 20న నోటిఫికేషన్ జారీ
- ఒక్కో సంఘానికి ఆరుగురు డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు



గోపాలపట్నం వద్ద ఆవ చానెల్

పాయకరావుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు మైనర్ సాగునీటి సంఘాలకు వచ్చే నెలలో ఎన్నికలు జరుగనున్నాయి. 2014లో టీడీపీ హయాంలో సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతోపాటు సాగునీటి సంఘాలకు ఎన్నికలు కూడా నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో పాయకరావుపేట మండలంలోని ఏడు మైనర్ సాగునీటి సంఘాల పరిధి గ్రామాల్లో ఎన్నికల సందడి అపుడే ప్రారంభమైంది. తాండవ నదిపై భూమి, ముఠా మినీ ఆనకట్టల పరిధిలోని ఏడు మైనర్ చానెల్ సిస్టమ్స్ ఉండగా, వీటిలో భూమి చానెల్ సిస్టమ్ ద్వారా మండలంలో పీఎల్.పురం, నామవరం, నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ల, సీహెచ్‌ఆర్‌బీ.పురం, దేవవరం, గొడిచెర్ల గ్రామాల్లో 2,220.18 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ముఠా చానెల్ సిస్టమ్ పరిధిలో పెదరాంభద్రపురం, ఎస్.నర్సాపురం, శ్రీరాంపురం, కేశవరం, కుమారపురం, కందిపూడి, ఈదటంతో పాటు కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం, కవలపాడు గ్రామాల్లో 5,2091.58 ఎకరాల ఆయకట్టు ఉంది. మంగవరం చానెల్ సిస్టమ్ ద్వారా మండలంలో అరట్లకోట, మంగవరం, నామవరం తోపాటు నక్కపల్లి మండలం గునిపూడి గ్రామంలో 1,341.19 ఎకరాలు, మాసాహెబ్‌పేట చానెల్ సిస్టమ్ ద్వారా మండలంలో మాసాహెబ్‌పేట, సత్యవరం గ్రామాల్లో 707.52 ఎకరాల ఆయకట్టు ఉంది. అదే విధంగా ఆవ చానెల్ సిస్టమ్ ద్వారా మండలంలో గోపాలపట్నం, గుంటపల్లి, పెంటకోట, సత్యవరంతో పాటు, నక్కపల్లి మండలం గునిపూడి గ్రామాల్లో 2,504.12 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక రాజవరం చానెల్ సిస్టమ్ ద్వారా మండలంలో రాజవరం, కేశవరం గ్రామాల్లో 468.29 ఎకరాలు, కనుమల ట్యాంక్ పరిధిలో మండలంలోని పాల్తేరులో 223.41 ఎకరాల ఆయకట్టు ఉండగా, ఏడింటి పరిధిలోని సుమారు పది వేల మంది ఆయకట్టు రైతులు వచ్చే నెలలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా జల వనరుల శాఖ ఏఈ శ్రీరామూర్తి మాట్లాడుతూ వచ్చే నెల 10 తేదీన ఓటర్ల జాబితా ప్రకటన ఉంటుందని, 19వ తేదీ లోగా మార్పులు, చేర్పులు, సవరణలుచేసి తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని చెప్పారు. 20వ తేదీన నోటిఫికేషన్ జారీచేసి, 21 నుంచి 23వ తేదీలోపు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఒక్కో సాగునీటి సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకోగా, వీరిలో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## సుడిదోమ నివారణకు తూటికాడ కాషాయం పిచికారీ చేసుకోవాలి

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరిలో సుడిదోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తూటికాడ కషాయం పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ సూచించారు. శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈ జి.శ్రీరామ్మూర్తి, తాండవ రైతు సంఘం సీఈవో సత్యనారాయణ, టీడీపీనాయకులు చించలపు ప్రదీప్, వీహెచ్ఏ.వీరబాబు, వీపీఏ.గోపి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌శ్రీ జాతీయ అవార్డుకు ప్రసాద్

- సర్వసిద్ధి పీహెచ్‌సీలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షుడిగా విధులు



ఎస్.రాయవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్వసిద్ధి పీహెచ్‌సీలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షుడిగా పని చేస్తున్న డాక్టర్ పీఎన్‌వీఎస్ ప్రసాద్ భారత్‌శ్రీ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య, ఆరోగ్య సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా సులభంగా వివరించి చైతన్యవంతులగా చేయడానికి ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు.





రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన ఎస్.రాయవరం, ధర్మవరం అగ్రహారం విద్యార్థినులు

## హాకీ, ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థినుల సత్తా



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

ఎస్.రాయవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల విద్యార్థినులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థిని జి.వాహిని అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీను తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్‌లో జరిగిన హాకీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన చెప్పారు. అలాగే ఈ నెల 16న దేవరాపల్లిలో జరిగిన అండర్-14 బాల, బాలికల ఫుట్‌బాల్, అండర్-14, 17 సపక్ తక్రా పోటీల్లో ఇదే పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14 విభాగంలో టీఎస్‌వీ దుర్గ, చరిశ్మా, ఎ.దీపిక, కె.నందకిశోర్, సెపక్ తక్రా పోటీల్లో అండర్-17 విభాగంలో కె.ఫణీంద్ర, 14 విభాగంలో టీఎస్‌వీ దుర్గ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. హాకీ అండర్-14 విభాగంలో కె.నికిత, బి.నిహారిక ఎంపికైనట్టు తెలిపారు.

## తుఫాన్‌పై అప్రమత్తత అవసరం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు ఆదేశించారు. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం 24న తీవ్ర తుఫాన్‌గా మారుతుందని, కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర హోం మంత్రి అనిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దీంతో మత్స్యకార గ్రామాలు పాల్మన్‌పేట, వెంకటనగరం, రాజవరం, కేశవరం, ఈదటంలో బుధవారం ఆయనపర్యటించి తుఫాన్ రక్షిత భవనాలను పరిశీలించారు. తుఫాన్‌ను ఎదుర్కోవడానికి అందరూ అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి రామగోవిందు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వరి సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన

నక్కపల్లి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): వరి సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఉద్దండపురం గ్రామంలో ఏవో ఉమాప్రసాద్ ఆధ్వర్యంలోబుధవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ చీడపీడలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు ఎంతో మేలని సూచించారు. సిఫారసుల మేరకు ఎరువులు, యాజమాన్య పద్ధతులు చేపట్టాలని వివరించారు. పొలం గట్లపై బంతిపూల మొక్కలను నాటడం ద్వారా దోమను తగ్గించడంతో పాటు తెగుళ్లు రాకుండా నివారించవచ్చని చెప్పారు. వీటి ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, వీపీఏ రాకేశ్ తదితరురి పాల్గొన్నారు.

## వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎస్.రాయవరం: మండలంలోని గుడివాడ, గుర్రాజుపేట గ్రామాల్లో బుధవారం ఏవో సౌజన్య పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. వరి పంటలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ సుడిదోమ, పొడ తెగులు లేక మాగు తెగులు వల్ల వరికి కలిగే నష్టాలను తెలిపారు. అలాగే దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వైద్యాలయంలో ఎట్టకేలకు సీటీస్కాన్ సేవలు

- చెన్నై నుంచి వచ్చిన టెక్నీషియన్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో అందుబాటు
- నాలుగు రోజులు ట్రయిల్ రన్
- తొలి రోజు ఆరుగురు రోగులకు పరీక్షలు



సిటీస్కాన్ ద్వారా రోగికి పరీక్ష జరుపుతున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎట్టకేలకు బుధవారం సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సుమారు పది నెలల క్రితం పాత స్కాన్ స్థానంలో కొత్తది వచ్చినప్పటికీ టెక్నీషియన్ లేక ఇంత వరకు వినియోగంలోకి రాలేదు. అయితే చాలా కాలంగా వినియోగంలో లేకపోవడంతో గత వారం 19వ తేదీన దీనిని వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే పూర్తిస్థాయిలో బుధవారం నుంచి వినియోగంలోకి తెచ్చామని వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గత నాలుగు రోజులుగా ట్రయిల్ రన్ నిర్వహించి, కలెక్టర్ ఆదేశాల మేరకు చెన్నై నుంచి టెక్నీషియన్ రప్పించి చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆరుగురికి సిటీస్కాన్ ద్వారా పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. అత్యవసర సమయంలో కూడా అవసరం మేరకు టెక్నీషియన్‌ను రప్పించి ఈ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు.

## మత్స్యకారుల సమస్యలపై ఎస్పీ సిన్హా సమీక్ష



పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాంబిల్లి మండలం వాకపాడులో నావికా ప్రత్యామ్నాయ స్థావరానికి అప్పగించనున్న భూముల సర్వేను బంగారమ్మ పాలెం మత్స్యకారులు అడ్డగించిన నేపథ్యంలో ఎస్పీ తుహిన్‌సిన్హా బుధవారం పరవాడ, నర్సీపట్నం సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బంగారమ్మపాలెం మత్స్యకారుల సమస్యల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్, ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జునరావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రామ రెవెన్యూ సహాయకుల' జిల్లా కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులు

తుమ్మపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు గరికిపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కె.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.లోవరాజు, సహాయ అధ్యక్షునిగా చింతా అప్పారావు, ఉపాధ్యక్షులుగా పి.దండు, వాకాడ గణేష్, కోశాధికారిగా సీహెచ్.అప్పలరాజు, ఉప కార్యదర్శిగా బొడ్డు సింహాచలంనాయుడు, కార్యవర్గ సభ్యులుగా లోవకుమారి, అప్పలనర్సమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలపై పోరాటం చేసేందుకు అంతా కలిసి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాఘవేంద్ర, సూరిబాబు, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు ఇరువైపులా తుప్పలతో తిప్పలు



మాకవరం రోడ్డులో ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు

తుమ్మపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల రహదారులకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం రహదారుల్లో ఈ దుస్థితి నెలకొంది. కొన్నిచోట్ల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు మరింతగా పెరిగిపోయాయి. దీంతో రోడ్లపై ప్రయాణించేవారిని విషసర్పాల భయం వెంటాడుతోంది. చీకటి పడిందంటే భయం..భయంగా రాకపోకలు సాగిస్తున్నామని అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇటువంటి చోట్ల తుప్పలను తొలగించేలా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు. ఈ సమస్యను డీపీవో శిరీషారాణి వద్ద ప్రస్తావించగా, గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు తొలగించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అవసరం మేరకు ఉపాధి హామీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది సహకారంతో రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చెత్త, తుప్పలు తొలగించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని 32 పంచాయతీల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్టు వివరించారు.



పాపయ్యపాలెం రోడ్డులో...

# జగనన్న కాలనీలో సమస్యల తిష్ఠ

- కానరాని వీధి రోడ్లు, కాలువలు
- ఇళ్ల మధ్యే మురుగుతో దోమలు విజృంభణ
- పట్టించుకోని అధికారులు.. అవస్థలు పడుతున్న నివాసితులు



ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగు



పరవాడ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల జగనన్న కాలనీ



కాలనీలో వీధి రోడ్లు లేని దృశ్యం

పరవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. కాలనీ ఏర్పాటై రెండేళ్లు కావస్తున్నా ఇక్కడ ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. ఈ కారణంగా కాలనీవాసులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ సుమారు యాభై కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నాయి. కొండకు ఆనుకుని కాలనీ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా రాళ్లు తేలి దర్శనమిస్తుంది. వీధి రోడ్లు లేకపోవడం వల్ల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కాలువలు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాడుక నీరంతా ఇళ్ల మధ్యే నిల్వ ఉండిపోతుంది.

ఫలితంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. మౌలిక వసతులు కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చొరవ తీసుకుని కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

## రెవెన్యూ గ్రామ సభలో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం

- సబ్బవరం తహసీల్దార్ చిన్నికృష్ణ



గొటివాడలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ తదితరులు

సబ్బవరం, అక్టోబరు 23 : రెవెన్యూ గ్రామ సభల్లో రైతుల వద్ద నుంచి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపిస్తామని సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. గొటివాడలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు చక్కని వేదికగా పేర్కొన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి భూ సమస్యలను తెలుసుకున్నారు. 54మంది అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణేశ్, సర్పంచ్ సాలాపు మీన, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా సత్యారావు, గ్రామ పెద్దలు సాలాపు వెంకటేశ్వరరావు, సూరిబాబు, మాజీ ఎంపీటీసీ బొండా కళ్యాణ్, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో వాత్సల్య తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు అర్జీని అందిస్తున్న టీడీపీ నాయకులు

పరవాడ : పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 30, 33, 81, 82, 25, 176, 270, 302, 339, 279లలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిరక్షించాలని టీడీపీ నాయకులు పైలా బుజ్జి, పైలా చినఅక్కునాయుడు, పైలా సత్యనారాయణ తదితరులు కోరారు. బుధవారం పరవాడలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ కొఠారి సురేష్‌నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. పరవాడ రెవెన్యూ పరిధిలో పలుచోట్ల గెడ్డ వాగులు, ప్రభుత్వ భూములు, నీటి ప్రవాహ భూములు, శ్మశానవాటికకు సంబంధించిన భూములు కబ్జాకు గురయ్యాయన్నారు.

## నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

పరవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పరవాడ 11/33 సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం పలు గ్రామాలకు గురు వారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం, ఎస్సీ కాలనీ, సాయినగర్‌కాలనీ, శేషాద్రినగర్, పి.బోనంగి, సంస్కృతి గ్లోబల్‌స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు.

కొత్తూరు : కశింకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కొత్తూరు సెక్షన్ కార్యాలయానికి చెందిన 33/11 కేవీలో మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని డీఈఈ రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి మండలంలోని కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, వేటజంగాలపాలెం, సంపతిపురం గ్రామాల్లో విద్యుత్ ఫీడర్ల, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఈ అంతరాయం ఏర్పడనుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## సేంద్రియ పద్ధతితో వరిసాగు ఎంతో మేలు




రావాడలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

పరవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పద్ధతుల్లో వరి సాగు రైతులకు ఎంతో మేలని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి అన్నారు. మండలంలోని రావాడ, వాడచీపురుపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. వరి కంకులు పాలు పోసుకునే దిశలో ముందస్తు చర్యల్లో భాగంగా లీటరు నీటిలో ఐదు మిల్లీమీటర్ల వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో తూల, సూక్ష్మపోషకాల లోపాల నివారణకు తెల్లజిల్లేడు ఆకుల ద్రావణాన్ని తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ ద్రావణం తయారీకి పది కేజీల తెల్లజిల్లెడు ఆకుల, పది లీటర్ల దేశవాళీ ఆవుమూత్రం 200 లీటర్ల నీటిలో కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి ఆ ద్రావణాన్ని వడకట్టిన అనంతరం పంటల పై పిచికారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు గౌతమి, అనిత, జాస్మిన్ పాల్గొన్నారు.

## విజయవాడ వరద బాధితులకు పలు సంస్థలు విరాళాలు





విజయవాడలో మంత్రి లోకేశ్‌కు, అనకాపల్లిలో కలెక్టర్‌కు చెక్కులందిస్తున్న ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని వరద బాధితులకు సహాయం అందించేందుకు రాష్ట్ర నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయా విద్యాలయ హాస్టల్స్ అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఈ సంస్థల ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌కు రూ.లక్షా 10వేల చెక్కును విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో అందజేసినట్టు అసోసియేషన్ ప్రతినిధి ఎం.రాజుబాబు తెలిపారు. రాజుబాబుతో పాటు మంగపతిరావు, గీతాజ్యోతి, రఘుబాబు, కృష్ణమూర్తి, వెంకట శివుడు, శివారెడ్డి పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్: విజయవాడ వరద బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రాంబిల్లి మండలం గురజాపాలెం స్టైరాక్స్ లైఫ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కర్మాగారం రూ.రెండు లక్షల 50వేలను విరాళం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కర్మాగారం డిప్యూటీ జనరల్ మేనేజర్ సీహెచ్‌వీ రాంప్రసాద్ కలిసి అందించారు. మరింత మంది వరద బాధితులకు సహాయం చేయడానికి ముందుకు రావాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు

- మోటార్ వాహనాల కొత్త చట్టంపై అవగాహన అవసరం
- పట్టుబడిన వాహనాల వేలంలో ఆర్టీవో మనోహర్



కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహిస్తున్న ఆర్టీవో మనోహర్

తుమ్మపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మోటార్ వాహనాల కొత్త చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్టీవో గోపిశెట్టి మనోహర్ అన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఇక్కడి ఆర్టీవో కార్యాలయంలో బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలలో ఐదింటిని వేలం పాటలో ఉంచగా 32 మంది పాడుకునేందుకు పోటీపడ్డారన్నారు. వేలం పాట ద్వారా రూ.లక్షా 84వేల600 ప్రభుత్వానికి ఆదాయం చేకూరిందన్నారు. అలాగే గత రెండు వారాలుగా నిబంధనలు పాటించని వాహనాలపై పలు కేసులు నమోదు చేశామని చెప్పారు. లైసెన్స్‌లు లేని 60 వాహనాలు, ఇన్సూరెన్స్ లేనివి 151, హెల్మెట్ కేసులు 335, సీటుబెల్టు కేసులు పది, ఫిట్‌నెస్ కేసులు 132 నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే 44 వాహనాలపై ఓవర్‌లోడ్ కేసులు నమోదు చేశామన్నారు. మోటార్ వాహనాల కొత్త చట్టం ప్రకారం లైసెన్సు లేకుండా వాహనాలు నడిపే వారికి రూ. ఐదువేలు, హెల్మెట్ లేని వారికి రూ. వెయ్యి, ఆర్‌సీ లేని వారికి రూ. రెండు వేలు, ఫిట్‌నెస్ లోపించిన వాహనాలకు రూ.ఐదువేలు, ఇన్సూరెన్స్ లేని వారికి రూ. రెండు వేలు, సెల్‌ఫోన్, ట్రిపుల్ డ్రైవింగ్‌కు రూ.1500లు అపరాధ రుసుము విధించడం జరుగుతుందని చెప్పారు. హేవీస్పీడ్ వాహనాలకు రూ. వెయ్యి నుంచి రెండువేలు, ట్రాన్స్‌పోర్టు పర్మిట్ లేని వాహనాలకు రూ. పది వేలు చొప్పున అపరాధ రుసుం విధించి కేసులు నమోదు చేయనున్నట్టు చెప్పారు. వాహనదారులు తప్పక నిబంధనలు పాటించాలని ఆయన

## తెలుగు కళాజాతరలో సాయిరాం ప్రతిభ



జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటున్న సాయిరాం

పరవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళాజాతర కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో సాయిరాం అద్భుత ప్రతిభ చూపారు. సంగీతం, సాహిత్యంలో ఆయన చూపిన అసాధారణ ప్రతిభకు నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. వైద్యాధికారిణులు జయశ్రీ కర్మిషా, హారిక, వైద్య సిబ్బంది ఆయకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు



అభిమానుల నడుమ కేక్ కట్ చేస్తున్న గోపాలరాజు

అనకాపల్లిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రామచంద్ర థియేటర్ ఆవరణలో బుధవారం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలను పట్టణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ డీవీవీ గోపాలరాజు ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. థియేటర్ సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఫ్యాన్స్ పట్టణశాఖ అధ్యక్షుడు జీవీఎల్ఎస్ రాజు, గౌరవాధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి కాండ్రేగుల జోగేంద్ర, కోశాధికారి కొణతాల అరవింద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.

## తహసీల్దార్ దృష్టికి రెవెన్యూ శాఖ పరమైన సమస్యలు

సబ్బవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి. చిన్నికృష్ణను కూటమి నేతలు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. వీటి పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా విన్నవించారు. తొలుత పుష్పగుచ్ఛాన్ని అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీవీవీ ఎస్ఎన్ రాజు, మాజీ ఎంపీపీ గండి దేముడు, టీడీపీ మండల కార్యదర్శి కొరాడ శ్రీనివాసరావు తదితరులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రముఖ వ్యాపారవేత్త 'యల్లపు' కన్నుమూత



వెంకటరమణ (ఫైల్ )

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త యల్లపు వెంకటరమణ (84) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఈయనకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎరువులు, బెల్లం వ్యాపారిగా ప్రసిద్ధి చెందారు. వర్తక సంఘం అనుబంధ ఆలయాలు, అనుబంధ సంఘాలకు ప్రతినిధిగా వ్యవహరించి, వాటి అభివృద్ధికి కృషి చేశారు. ఈయన మృతి కారణంగా ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో బెల్లం లావాదేవీలను నిలిపివేశారు. పలువురు వర్తకులు, పలు సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు దాసరిగెడ్డ రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

## తెలంగాణలో తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి



మార్కెట్‌యార్డులో ర్యాలీ చేస్తున్న వాకర్లు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పర్యవేక్షణ సమితి ఆధ్వర్యంలో వాకర్స్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, పిరాట్ల నరసింహమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును ఖరారు చేసి గెజిట్ నోటిఫికేషన్ చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి అదే పేరు కొనసాగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆ పేరు తొలగించి వేరే పేరు పెట్టాలనే ఆలోచనతో ఉన్నట్టు సమాచారం ఉందన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగుజాతి ఔన్నత్యం కోసం పోరాటం చేసిన వ్యక్తిగా కొనియాడారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచన చేయాలని కోరారు. వాకర్స్ ఎంపీ లోవరాజు, ఎం.రవికుమార్, కేవీ సూరిబాబు, కె.ఆదిబాబు, యల్లపు నూకరాజు, డాక్టర్ డీడీ నాయుడు, టి.బంగార్రాజు, బూడిద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీలపై ఆక్రమణల తొలగింపు

తుమ్మపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాల గవరపేటవీధిలోని డ్రైనేజీల=పై ఆక్రమణలను తొలగింపు చర్యలను బుధవారం చేపట్టారు. జేసీబీ సాయంతో తొలగించారు. గవరపేట వీధి రామాలయం నుంచి శివాలయం వరకు, గవరపేట వీధి నుంచి ప్రమీలానగర్ వరకు డ్రైనేజీల నిర్మాణ పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు చెప్పారు. ఈ మేరకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీలు చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, ఉపసర్పంచ్ చదరం చిన్న, నాయకులు పీలా విశ్వేశ్వరరావు, పీలా తాతునాయుడు, పెతకంశెట్టి బలరాం, విల్లూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చీడిపల్లిలో రేకులు ధ్వంసమై పాఠశాల భవనం పైకప్పు


శిథిలావస్థలో పాఠశాల భవనం


లోన కిటికీలు, తలుపుల దుస్థితి

# శిథిల భవనంలో చదువులు

- చీడిపల్లిలో చిన్నారుల కష్టాలు
- ఐదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన భవన నిర్మాణం
- నాడు-నేడులో నిధులు మంజూరు కాని వైనం
- మరమ్మతు చేపట్టాలని గ్రామస్థులు అభ్యర్థన

చిన్నారులపై పరిసరాల ప్రభావం ఎంతో ఉంటుంది. పాఠశాల ఆవరణ ఆహ్లాదకరంగా ఉంటేనే పసి మెదళ్లు వికసిస్తాయి. కానీ, ఇందుకు భిన్నమైన పరిస్థితులు గిరిజన గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. కొయ్యూరు మండలం చీడిపల్లి పాఠశాలలో చదివేందుకు కాదు.. కూర్చునేందుకు వీలు లేని దుస్థితిలో ఉంది. తరగతి గది రేకులు ఎగిరిపోయాయి. భవనం శిథిలమైంది. దీంతో వరండాల్లో చిన్నారులకు బోధన సాగిస్తున్నారు. గత వైసీపీ పాలనలో నాడు- నేడు పథకం ఈ పాఠశాలకు వర్తించలేదు.

కొయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదరాళ్ల పంచాయతీ శివారు చీడిపల్లి ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో వసతి కొరత వెంటాడుతోంది. సుమారు 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు,వలంటీరు బోధిస్తున్నారు. అయితే, పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. పై కప్పు రేకులు నాలుగు సంవత్సరాల క్రితం వీచిన గాలులకు దెబ్బతిన్నాయి. భవనం గోడలు బీటలు వారి, గచ్చులు ఆనవాళ్లు లేకుండా పోయాయి. అప్పటినుంచి ఈ భవనంలోనే చిన్నారులు అవస్థల మధ్య చదువులు కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి గ్రామస్తులు పలుమార్లు సమస్య తీసుకువెళ్లినా కనీస మరమ్మతులకు వీలుగా నిధులు కేటాయించలేదు. స్థానిక విద్యాశాఖాధికారులు పలు దఫాలు ఉన్నతాధికారులకు నివేదించినా ఫలితం లేకపోయింది. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు- నేడు పథకం ఈ పాఠశాలకు వర్తించలేదు. ఇటువంటి భవనాలు మండలంలో మారుమూల కొండలపై సుమారుగా 10 వరకు ఉన్నాయి. ఇవి కొండలపై ఉండటంతో ఈ భవనాలకు పథకం వర్తింపునకు నోచని పరిస్థితి. కొండలపై ఉన్నా రహదారి సౌకర్యం ఉన్నా వీటిని నాడు- నేడు పథకంలో చేర్చకపోవటంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకత కేవలం రోడ్డు పక్క పాఠశాలలకే పరిమితం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినందున ఇప్పటికైనా అధికారులు ఇటువంటి పాఠశాల భవనాలలను గుర్తించి అభివృద్ధి చేయాల్సి ఉంది. వెంటనే మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటే చిన్నారులకు చదువుకు ఆటంకం లేకుండా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**భవనాల మరమ్మతుకు చర్యలు: -ఎంఈవో రాంబాబు**

ఎంఈవో రాంబాబును చీడిపల్లి పాఠశాల పై ప్రశ్నించగా నాడు-నేడులో ఈ భవనాన్ని చేర్చలేదని రెండోవిడతలో పథకం వర్తింపచేసేలా నివేదికలు ఇచ్చిన నిధులు కేటాయింపు జరగలేదన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పాఠశాల నిర్వహణకు అన్ని వసతులు కల్పనతో భవన మరమ్మతులకు చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. .


విధి లేక వరండాలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థి ఓంకార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయభారతి, అధ్యాపకులు

చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ అండర్- 18 క్రీడా పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి తగ్గి ఓంకార్ ఎంపికయ్యాడు. ఈనెల 17 నుంచి 20 వరకు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సౌత్ జోన్ క్రీడల్లో లాంగ్‌జంప్ విభాగంలో పాల్గొన్న ఓంకార్ ఎనిమిదో స్థానంలో నిలిచి జాతీయ క్రీడలకు అర్హత సాధించాడు. ఈ నెల 24 నుంచి 25 వరకు భువనేశ్వర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. ఆర్థికంగా వెనుకబడిన గిరిజన విద్యార్థి కావడంతో ఎంఈవో బొండపల్లి శ్రీనివాసరావు రూ. 5వేలు, కోఫోకాన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు రూ.2 వేలు రవాణా ఖర్చుల కింద అందజేశారు. ఈ విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి, ఫిజికల్ డైరెక్టర్ శివ రామ్ కుమార్ అభినందించారు.

## పచ్చకామెర్లతో గిరిజన యువకుడి మృతి


మృతుడు కొండబాబు (ఫైల్‌ఫొటో)

ముంచంగిపుట్టు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట పంచాయతీ తలాబుతోట గ్రామానికి చెందిన కె.కొండబాబు (32) అనే గిరిజనుడు పచ్చకామెర్లతో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొండబాబును కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు తీసుకువచ్చారు. వైద్యుల పరీక్షల్లో పచ్చకామెర్లుగా నిర్ధారణ అయ్యింది. అయితే, అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడు భార్య గౌరి ఎనిమిది నెలల గర్భిణీ కాగా, ఒక పాప ఉంది. అందరితో కలివిడిగా మెసిలే కొండబాబు మృతితో తలాబుతోటలో విషాదయచాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు: సీఐ

చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె. కూర్మారావు హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో ఆరు మద్యం దుకాణాలకు లైసెన్సులు జారీ చేశామన్నారు. యజమానాలు కచ్చితంగా ఎంఆర్‌పీ ధరకు మాత్రమే మద్యం విక్రయించాలన్నారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేయరాదన్నారు. ఈనెల 31 వరకు ఈ ప్రొవిజనల్ లైసెన్సు కొనసాగుతుందన్నారు.

## తలబరుసింగిలో తాగునీటి సదుపాయం


తాగునీటి ట్యాంక్‌ని ప్రారంభిస్తున్న ఏఈ విజయ్‌కుమార్, స్థానికులు

జి.మాడుగుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రక్షిత పథకాల ద్వారా అందించే తాగునీటిని ఉపయోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని వంతల పంచాయతీ అత్యాంత మారుమూల తలబరుసింగిలో జేజేఎం ద్వారా రూ.7.50లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన తాగునీటి గ్రావిటీ పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఇంటింటికి కుళాయిల ద్వారా అన్ని కుటుంబాలకు తాగునీటి సదుపాయం కల్పించినట్టు ఏఈ ఈ సందర్భంగా వివరించారు.

## ఆరుగురిపై తూనికలు, కొలతల కేసులు

పాడేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు మండలంలో ఆరుగురు వర్తకులపై కేసులు నమోదు చేసినట్టు తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాకు సరిహద్దున ఉన్న ముంచంగిపుట్టులోని పలు దుకాణాల్లో సరకులను తనిఖీలు చేశామని, వాటిలో ఒడిశా నుంచి దిగుమతి చేసిన ప్యాకెట్లలో బరువుల్లో తేడాలను గుర్తించామన్నారు. పలు డెయిరీ ఉత్పత్తులు సైతం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అందుకు బాధ్యులైన ఆరుగురు వర్తకులపై కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా కల్యాణ్‌రామ్



చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా కల్యాణ్‌రామ్ నియమితులయ్యారు. ఐదేళ్లపాటు ఇక్కడ పనిచేసిన ఏఈఈ భగవంతరావుకి అనకాపల్లి జిల్లాకు బదిలీకాగా, ఆయన స్థానంలో శ్రీకాకుళం పాతపట్నంలో పనిచేస్తున్న కల్యాణ్‌రామ్‌ని నియమించారు. ఈమేరకు బుధవారం ఆయన విధుల్లో చేరారు. చింతపల్లి ఏఈఈ గడుతూరి స్వర్ణలత ప్రసూతి సెలవులో ఉండడంతో ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

## ముంచంగిపుట్టులో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డివిజన్‌లో పెదబయలు 33 కేవీ విద్యుత్ ఫీడర్ నిర్వహణలో భాగంగా ముంచంగిపుట్టు మండలంలో ఈనెల 25న శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపు చేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఏబీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మండలంలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## కాఫీ కార్మికుల సమస్యలపై స్పందించకుంటే సమ్మె

- కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య


నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీఎఫ్‌డీసీ అధికారులు మొండివైఖరి వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేపడతామని కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం నాయకులు, కార్మికులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ ఈనెల 15తేదీన రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) చింతపల్లి డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో అధికారులకు కార్మిక సంఘం నాయకులు పది డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేశామన్నారు. 19 తేదీన కాఫీ కార్మిక సంఘం నాయకులతో అధికారులు చర్చలు జరిపినా, సమస్యల పరిష్కారంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల పరిధిలో పనిచేస్తున్న కాఫీ కార్మికుల దీర్ఘకాల సమస్యలపై కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం మరో విడత చర్చలు జరిపి ఈనెల 31వ తేదీలోగా సమస్యలు ఎరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. లేదంటే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కనకవల్లి, హెల్పర్ యూనియన్ నాయకులు మోరి గిరి, బి. పాపారావు, వెంకటేశ్, శివ పాల్గొన్నారు.

## పాఠశాలకు కంచాలు, టీవీ వితరణ


పాఠశాలకు టీవీ అందిస్తున్న ప్రవాస భారతీయ దంపతులు

హుకుంపేట అక్టోబరు 23 ఆంధ్రజ్యోతి: మండలంలోని దుర్గం పంచాయతీ పాటిగరువు ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు రెడ్డి నారాయణరావు అధ్వర్యంలో ప్రవాస భారతీయురాలు శిరిష దంపతుల ఆర్థిక సాయంతో కంచాలు, టీవీ, 150 అడుగుల గ్రీన్‌మేట్ వితరణగా అందించారు. విద్యార్థుల అవసరాలను తెలుసుకుని వీటిని ఆ దంపతులు సమకూర్చారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుడు కోటిబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**తాజంగిలో కంప్యూటర్ విరాళం**

**చింతపల్లి:** మండలంలోని తాజంగి ప్రభుత్వ ప్రాథకోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ఓ యువకుడు రూ.25 వేల విలువైన కంప్యూటర్ విరాళంగా అందజేశారు. పెనుమల నారాయణరావు ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం ఆయన వడ్డాది మాడుగుల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు క్రాంతికుమార్ తండ్రి జన్మదినం పురస్కరించుకుని కంప్యూటర్‌ని హెచ్‌ఎం దేముడుకిఅందజేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ శెట్టి మోహన్ రావు, జనసేన నాయకుడు ఉగ్రంగి లక్ష్మణరావు, శెట్టి శంకరరావు, మొస్య సత్తిబాబు పాల్గొన్నారు.

## ఆర్‌ఐగా జగ్గయమ్మ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించి జగ్గయమ్మ

అనంతగిరి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆర్‌ఐగా పంచాడి జగ్గయమ్మ బాధ్యతలను స్వీకరించారు. పాడేరు నుంచి ఆమె ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాణిక్యంను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

## గిరిజన కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలి

- కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఉత్పత్తి చేసే కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఐటీడీఏ అధికారులు, కాఫీ అధికారులతో కాఫీ విక్రయాలపై బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాఫీని గిరిజన రైతులు సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారని, ఈస్థితిలో సరైన ధర కల్పించాల్సిన అవసరముందన్నారు. చింతపల్లి మాక్స్ సంస్థ సేకరిస్తున్న కాఫీని బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామన్నారు. కాఫీ సేకరణలో తగిన నాణ్యతలు పాటించాలని సూచించారు. అలాగే కాఫీ తోటలకు జియో ట్యాగింగ్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాఫీ నాణ్యతపై కాఫీ విభాగం లైజాన్ వర్కర్లకు అవగాహన కల్పించాలన్నారు. చింతపల్లి మాక్స్ సంస్థ ఈఏడాది 600 టన్నుల పార్చిమెంట్ కాఫీని ఉత్పత్తి చేయనుందన్నారు. కాఫీని బహిరంగ వేలంలో విక్రయిస్తామని కలెక్టర్ ప్రకటించారు. రెండేళ్లుగా అరకు కాఫీ ఫైన్‌కప్ అవార్డును పొందిందని కలెక్టర్ తెలిపారు. ఐటీడీఏ అధికారులు వాసుదేవమూర్తి, కిరీట్ పాండే మాట్లాడుతూ.... తాము మాక్స్ సంస్థ నిర్వహించే కాఫీ వేలంలో పాల్గొంటామని, వాటి విక్రయాలు, వేలం సమయాల్లో తమకు విధిగా సమాచారం అందించాలని కోరారు.ఈసమావేశంలో కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రమేశ్, ఐటీడీఏ కాఫీ ఏడీ ఎన్.అశోక్, ఐటీడీఏ ఏవో ఎం.హేమలత పాల్గొన్నారు.

## పారిశుధ్యం కల్పనకు ప్రత్యేక చర్యలు


చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్, జెడ్పీటీసీలు

చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతపల్లిలో పారిశుధ్య కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. బుధవారం పంచాయతీలో ఇంటింటికీ తడి, పొడి చెత్త బుట్టలనుఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పి. ఆశాజ్యోతి, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, దారలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

## మంచు దుప్పటి


హుకుంపేట మెయిన్ రోడ్డులో మంచు

హుకుంపేట అక్టోబరు 23 ఆంధ్రజ్యోతి: హుకుంపేట- పాడేరు ప్రధాన మార్గంలో బుధవారం ఉదయం నుంచి 10 గంటల వరకు మంచు వీడలేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణం సాగించారు. మరోవైపు చలి పెరిగింది. దీంతో సాయంత్రం, ఉదయం వేళల్లో జనాలు బయటకు పెద్దగా రావడంలేదు. రక్షణగా టోపీలు, స్వెట్టర్లు ధరిస్తున్నారు.

## అనుమతి లేకుండా అటవీ కలపను తరలిస్తే చర్యలు


స్వాధీనం చేసుకున్న కలప వద్ద అటవీశాఖ రేంజ్ అధికారి శీనివాసరావు

డుంబ్రిగుడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అనుమతి లేకుండా సిల్వర్ ఓక్, నీలగిరి, అకేషియా తదితర చెట్ల కలపను అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు తప్పవని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని సోవ్వా పంచాయతీ సోవ్వా, కాగువలస, మాలివలస, పనసవలస, ఒడియావలస, గొప్పులవలస గ్రామాల్లో తోటలను పరిశీలించారు. అక్కడక్కడ నీలగిరి, అకేషియా చెట్లు నరికి తరలించడానికి సిద్ధంగా ఉంచిన కలపను గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని చర్యలకు ఉన్నత అధికారులకు సిఫార్సు చేస్తామని ఆయనచెప్పారు.

## మారెమ్మ ఆలయంలో చండీహోమం


యాగంలో పాల్గొన్న భక్తులు

సీలేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారెమ్మ ఆలయంలో బుధవారం నవ చండీ హోమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ గణపతి, సహిత, మన్యుసుక్త సహిత, రుద్రహోమం, సహిత నవ చండీ హోమం చేపట్టారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో పూర్ణ హుతితో ఈ పూజలు ముగిశాయి.

## సర్పంచుల సొంత నిధులతో రహదారికి మరమ్మతు


మరమ్మతు పనుల్లో సర్పంచ్‌లు, గ్రామపెద్దలు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జర్రెల ఘాట్ రోడ్డులో గోతులను ముగ్గురు సర్పంచులు సంయుక్తంగా సొంత నిధులతో పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలకు ఆదివాసీలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మొండిగెడ్డ, జర్రెల, వంచుల సర్పంచ్‌లు ప్రియాంక, నాగరాజు, వనపల కాసులమ్మ నిధులు సమీకరించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో నాలుగు కిలోమీటర్ల రోడ్డులో గోతులను పూడ్చారు.

**మండల కేంద్రంలో చెత్త తొలగింపు**

గూడెంకొత్తవీధిలో రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను పంచాయతీ అధికారులు తొలగించారు. కోళ్ల దుకాణాల యజమానులు రహదారి పక్కన వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో స్థానికులు ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావుకి ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో ఆదేశాలపై పంచాయతీ అధికారులుఈవోపీఆర్‌డీ పర్యవేక్షణలో వ్యర్థాలను తొలగించారు.

**సీసీ రోడ్డు నిర్మాణం**

**సీలేరు:** గూడెంకొత్తవీధి మండలం శివారు గాలికొండ పంచాయతీ జాజిగొందిలో రూ. 6 లక్షల ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ కాకూరు బుజ్జిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామాలకు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్, టీడీపీ నాయకుడు కొర్ర పాండు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి

అనంతగిరి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉపాధి పథకం పనులు కల్పించేందుకు సిబ్బంది కృషిచేయాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం క్షేత్రస్థాయి సిబ్బంది, టీఏలతో సమీక్ష నిర్వహించారు. హార్టీకల్చర్ లబ్ధిదారులకు చెల్లింపుల్లో నిర్లక్ష్యం వద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోని ఏపీడీ పవన్, ఏపీవో సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు ప్రభుత్వం పెద్దపీట

చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీటవేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్ధాంతరంగా నిలిచిన పక్కా గృహాలు పూర్తికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్టు చెప్పారు.తాజాగా జన్‌మన్ పథకంలో 950 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఈనెల 26తేదీ నుంచి జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నేత రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, అబ్బాయిదొర, నాగభూషణం, జనసేనమండలాధ్యక్షుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

## తాగునీటి పథకం మరమ్మతులు చేపట్టాలని వినతి

ముంచంగిపుట్టు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో తాగునీటి పథకం మరమ్మతు చేపట్టాలని కోరుతూ ఎంపీడీవోకి బుధవారం సర్పంచ్ వి.రమేశ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.3 కోట్లు వెచ్చించి ఈ తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. దీని నుంచి సుమారు 11 గ్రామాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. కానీ, ఆ పథకం మూలకు చేరి ఏళ్లు కావస్తున్నా సంబంధిత అధికారులు కనీసం దృష్టిసారించలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

# వరిలో సంరక్షణ చర్యలు చేపట్టాలి


ఒరిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంటలో సంరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డా.ప్రదీప్‌కుమార్ సూచించారు. మండలంలోని శరభన్నపాలెం, వెలగలపాలెం తదతర గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొలాల్లో చేనును కట్టలుగా కట్టి నిలబెట్టాలన్నారు. నీరు నిల్వలు తీయాలన్నారు. ఆర్ఎస్ఆర్ రకం వరి కోతకు సమీపించడంతో ఉండడంతో ఎటువంటి పిచికారీ చేయనవసరం లేదని రైతులకు తెలిపారు. నవంబరు 15 నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మండల వ్యవసాయ అధికారిని ఉమాదేవి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, వీఏఏలు, వీహెచ్ఏలు ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

**సేంద్రీయ సాగుతో లాభాలు**

**డుంబ్రిగుడ:** ఏజెన్సీ గిరిజన ప్రాంత రైతులు సేంద్రియ సాగుకు ప్రాధాన్యమివ్వాలని కోర్రాయి పంచాయతీ సర్పంచ్ కోములు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిన్న అంజోడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులతో పండించిన పంటలతో ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు.అనంతరంఏవో నీలవేణి మాట్లాడుతూఆర్గానిక్ సర్టిఫికెట్ కోసం రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హార్టీకల్చర్ అసిస్టెంట్ సాయిత, ఏపీ సీఎన్ఎఫ్ ఇన్‌చార్జి మహేష్, ఐసీఆర్‌పీ యూనిట్ కార్యకర్తలు, సీడబ్ల్యూఎస్ ఎన్జీవో ప్రతినిధి సునీల్, రైతులున్నారు.

**రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు కావాలి**

**హుకుంపేట:** గిరిజన రైతులు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యసాయశాఖ అధికారి లీలా వతి తెలిపారు. బుధవారం మండలంలోని మఠం పంచాయతీ పరిధి కొత్తూరు గ్రామంలోని పొలం పిలుస్తుంది కార్యక్రమం సర్పంచ్ శాంతికుమారి అధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రైతులు సాగు చేస్తున్న పంటలకు పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులు గ్రామంలో రైతు సంఘాలు ఏర్పాటు చేసుకుంటే బ్యాంకు రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు.ప్రభుత్వం యంత్రాలు, విత్తనాలను అందిస్తుందని పేర్కొన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మత్య కొండబాబు గోపాలపాత్రుడు, వ్యవసాయ సిబ్బంది మోహన్, శైలజ, కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

## శతశాతం వైకల్యం కలిగిన దివ్యాంగుల గుర్తింపునకు ఇంటింట సర్వే


గజపతినగరం పంచాయతీలో సర్వే చేస్తున్న అధికారులు

చోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజపతినగరం పంచాయతీలో బుధవారం నూరు శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులను గుర్తింపుపై సర్వే నిర్వహించారు. నూరుశాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు ప్రభుత్వం నెలకు రూ.15 వేలు ఇవ్వనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం గ్రామంలో సర్వే నిర్వహించిన వైద్య సిబ్బంది శరగడం వరహా నాగభూషణం అనే దివ్యాంగుడిని నూరుశాతం వైకల్యం కింద రూ.15 వేలు పింఛను కోసం గుర్తించి నమోదు చేశారు. కాగా గ్రామంలో బుధవారం రెవెన్యూ రీ సర్వే సదస్సును నిర్వహించిన తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు స్థానికుల నుంచి రెవెన్యూ సమస్యలపై అర్జీలు తీసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సర్వే కార్యక్రమంలో స్థానిక నాయకులు కనిశెట్టి రామునాయుడు, శరగడం రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుల సవరణకు 22 దరఖాస్తులు


చీడిగుమ్మల గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

గొలుగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల రెవెన్యూ గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ ద్వారా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. భూముల రీ సర్వేలో దొర్లిన తప్పులు సవరించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో 22 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో రీ సర్వే సర్వే నిర్వహించిన గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్నలు, వీఆర్వో పడాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్ సురేంద్రకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నర్సీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మునిసిపల్ వర్కర్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో బుధవారం కమిషనర్‌ను కలిసి సమస్యలు వివరించారు. కార్మికులకు రెయిన్ కోట్లు, సబ్బులు, కొబ్బరి నూనె ఎప్రాన్స్ ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పని భారం పడుతుందని తెలిపారు. జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. రెండు నెలల హెల్త్ అలవెన్సు బకాయిలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్, వేమగిరి రాజబాబు, సీహెచ్ కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

## చోడవరం నియోజకవర్గంలో పారిశ్రామిక వాడలు ఏర్పాటుచేయండి

» రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌కు జనసేన ఇన్‌చార్జి రాజు వినతి


కార్పొరేషన్ చైర్మన్ రామరాజుకు వినతి పత్రం ఇస్తున్న జనసేన ఇన్‌చార్జి రాజు

చోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పారిశ్రామిక వాడల ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకుబుధవారం అమరావతిలో రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులతో పాటు యువత అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, స్థానికులు పారిశ్రామికవేత్తలుగా తయారుకావడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై చైర్మన్ రామరాజు స్పందిస్తూ, నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారని చెప్పారు.

## సుడిదోమ తెగులుతో జర జాగ్రత్త


సదస్సులో మాట్లాడుతున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): వరి పంటకు సోకే సుడిదోమ తెగులుపై రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు సూచించారు. కేజే పురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో రైతులకు ఏవో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరిలో సుడిదోమ తెగులు ఆశించినపుడు ముందుగా వరి పొలంలో నీటిని లేకుండా చేయాలన్నారు. పొలాన్ని సీతాకులు లేకుండా ఆరబెట్టిన తర్వాత ఏసిఫేట్ అనే మందును ఒక లీటరు నీటికి 1.5 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణ, ఎంపీటీసీ సభ్యుడు బీజెట్టి శ్రీనివాసు, నాయకులు హరిబాబు, నాయుడు పాల్గొన్నారు.

# వాడీవేడిగా మండల సమావేశం

» సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

» వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ధ్వజం


సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

మాకవరపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. అంత ప్రచారమే తప్పితే క్షేత్ర స్థాయిలో చేసిందేమీ లేదని అధికారులను నిలదీశారు. దీంతో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది.

మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రుత్తల లక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మండల వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది వరి సాగు ఆశాజనకంగా ఉందని చెప్పారు. ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సేంద్రియ వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టిసారించాలని మాట్లాడుతుండగా, కొండల అగ్రహారం సర్పంచ్ అచ్చియ్యమ్మ అడ్డు తగిలారు. సేంద్రియ వ్యవసాయం అంటూ ప్రచారం తప్పితే గ్రామాల్లో కార్యక్రమాలు ఎక్కడా జరగలేదని ఎదురుదాడికి దిగారు. ఏ గ్రామంలో సేంద్రియ వ్యవసాయం జరుగుతుందో ఇప్పటికే చాలా మంది ప్రజాప్రతినిధులతో పాటు రైతులకు కూడా తెలియని పరిస్థితి ఉందని సమావేశం దృష్టికి తీసుకున్నారు.

అనంతరం గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని చెబుతుండగా సభ్యులు అడ్డు తగిలారు. మామిడిపాలెం, మాకవరపాలెం, తూటిపాల, కొండల అగ్రహారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు జేఈపై ధ్వజమెత్తారు. గ్రామాల్లో ఎక్కడా నీరు సక్రమంగా రావడం లేదని మండిపడ్డారు. ఇప్పటికే పనులు పూర్తయినప్పటికీ తాగునీరు ఎందుకు సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. అలాగే కొన్ని గ్రామాల్లో పనులు ఇంకా పూర్తికాలేదని చెప్పారు. బూరుగుపాలెం రెవెన్యూలోని 77 సర్వే నంబరులో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని తొలగించి అక్కడి రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ రమణ కోరారు. అలాగే బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు యర్రాపాత్రుడు మాట్లాడుతూ అనర్హుల ఫునరావాస కాలనీలో నిర్మాణం చేపట్టిన ఇంటిని కూల్చివేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. ఇంటిని కూల్చివేసిన వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనికి డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ స్పందిస్తూ నిర్మాణం చేపట్టే స్థలం విషయమై కోర్టు పరిధిలో ఉందని, వాటిలో నిర్మాణాలు చేపట్టకూడదని చెప్పారు. ఇంటిని కూల్చివేసిన వారిని గుర్తించామని, అయితే స్థలం వివాదాన్ని గుర్తించాల్సి ఉందని ఎస్ఐ దామోదరనాయుడు చెప్పారు. అనంతరం ప్రభుత్వం వివరణ చేసిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు పెట్ల సత్యవేణి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల ప్రహరీలకు రూ.9.4 కోట్లు

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కెకోటపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలో ప్రహరీ గోడలు లేని 62 పాఠశాలలకు రూ.9.4 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కెకోటపాడు మండలంలో 22 పాఠశాలలకు మూడు కోట్ల 74 లక్షల రూపాయలు మంజూరయ్యాయన్నారు. వీటిలో కెకోటపాడు జడ్పీ హెచ్ఎస్‌కు రూ.27.84 లక్షలు, వారాడ ఎంపీపీఎస్‌కు రూ.5.22 లక్షలు, శృంగవరం ఎంపీపీఎస్‌కు రూ.26 లక్షలు, కొత్త భూమి ఎంపీపీఎస్‌కు రూ.10.44 లక్షలు, సూరెడ్డిపాలెం ఎంపీపీఎస్‌కు రూ.8 లక్షల ఏడు వేలు, కెకోటపాడు కేజీబీవీకు రూ.46 లక్షలకు 11 వేలు, రామచంద్రపురం ఎంపీపీఎస్‌కు రూ.17 లక్షలు, బొట్టవానిపాలెం ఎంపీపీఎస్‌కు రూ.13.92 లక్షలు మంజూరైనట్టు పేర్కొన్నారు. అలాగే కింతాడ పాలెం ఎంపీపీఎస్‌కు రూ. ఎనిమిది లక్షల ఏడు వేలు, గొల్లలపాలెం ఎంపీపీఎస్‌కు రూ.13 లక్షల 92 వేలు, పీపీపాలెం ఎంపీపీఎస్‌కు రూ.13 లక్షల ఐదు వేలు, మల్లమ్మపాలెం ఎంపీపీఎస్‌కు రూ.13 లక్షల ఐదు వేలు, జక్కివన్నెపాలెం ఎంపీపీఎస్‌కు రూ.ఎనిమిది లక్షల ఏడువేలు, జోగన్నపాలెం ఎంపీపీఎస్‌కు రూ.ఎనిమిది లక్షల ఏడు వేలు మంజూరయ్యాయని చెప్పారు.

అలాగే కింతాడ ఎంపీపీఎస్‌కు రూ.18 లక్షల 27 వేలు, కొరువాడ ఎంపీపీఎస్‌కు రూ.13 లక్షల 92 వేలు, కొరువాడ జడ్పీహెచ్ఎస్‌కు రూ.27 లక్షల 84 వేలు, సింగన్నదొరపాలెం ఎంపీపీఎస్‌కు రూ.18 లక్షల 27 వేలు, గొండుపాలెం జడ్పీహెచ్ఎస్‌కు రూ.29 లక్షల 58 వేలు, చౌడువాడ జడ్పీహెచ్ఎస్‌కు రూ.31 లక్షల 32 వేలు, కొత్తూరు ఎంపీపీఎస్‌కు రూ.8 లక్షల ఏడు వేలు, గుల్లేపల్లి ఎంపీపీఎస్‌కు రూ.13 లక్షల ఐదు వేలు ప్రభుత్వం మంజూరు చేసినట్టు ఆయన వివరించారు.

## గ్రామ పరిశుభ్రతకు ఇంకుడు గొయ్యిలు అవసరం

» ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ బండారు శ్రీనివాసరావు

చీడికాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతకు ఇంకుడు గొయ్యిలు నిర్మించడం ఎంతో అవసరమని ఉపాధి హామీ పథకం ఏపీడీ బండారు శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మధ్యాహ్నం ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని గ్రామ పంచాయతీల్లోను వీధుల్లో మురుగునీరు నిల్వ ఉన్నచోట, ఇంటింట తప్పనిసరిగా ఇంకుడుగొయ్యిలు నిర్మించాలని, మురుగునీటిని నివారిస్తే పరిశుభ్రతకు అవకాశం ఉంటుందని చెప్పారు. దీనికి గ్రామస్థుల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. అలాగే రైతులకు ఉపయోగపడే పండ్లతోటల పెంపకానికి రైతుల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. మండలంలో 107 ఎకరాల్లో పండ్లతోటలు వేయాలని లక్ష్యం కాగా, ఇంతవరకు 70ఎకరాల్లో పూర్తిచేశారని, మార్చి 31లోగా మిగతా 37 ఎకరాల్లో పండ్లతోటలు పెంపకం పూర్తిచేయించాలని అన్నారు. గ్రామాల్లో పల్లె వనరులను గుర్తించాలని కోరారు. 2025-26లో పనులు గుర్తింపునకు గ్రామసభలు పూర్తిచేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో హేమసుందర్‌రావు, ఏపీవో అల్లు గంగునాయుడు, ఈసీ రమేష్, ప్లాంటేషన్, సూపర్‌వైజర్ కొరగింజల శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు బిసాన్‌పాత్రుడు, కె.ఎర్రునాయుడు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

» భారత కిషాన్ సంఘ్ అఖిల భారత కార్యకారిణి జలగం కుమార్‌స్వామి



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌స్వామి

మాడుగుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయం చేసేందుకు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని భారత కిషాన్ సంఘ్ అఖిల భారత కార్యకారిణి జలగం కుమార్‌స్వామి సూచించారు. స్థానిక సేవా భారతి కార్యాలయంలో బుధవారం జరిగిన తెన్నేటి రైతు ఉత్పత్తుదారులు సంఘం సర్వసభ్య సమావేశాన్ని సంఘం చైర్మన్ పిల్లా అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని వీడి రసాయనిక ఎరువులతో వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఆ వ్యవసాయానికి దూరంపెట్టి సేంద్రియ వ్యవసాయం చేస్తే దిగుబడితో పాటు అనేక ఉపయోగాలు ఉంటాయని అన్నారు. రైతులు పండించే పంటను వారే స్వయంగా విక్రయించి అధిక లాభాలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రస్తుతం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉందని అన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయం చేయడానికి ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి ఉందన్నారు. భవిష్యత్తులో వ్యవసాయం చేసే రైతుకు ఎన్నో విధాలుగా మంచి జరిగే పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. అనంతరం ఏడాది కాలంలో తెన్నేటి రైతు ఉత్పత్తుదారులు సంఘం చేసిన పలు కార్యక్రమాల గురించి చైర్మన్ అప్పలనాయుడు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, హైస్కూల్ జిరోహెచ్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పశు వైద్యశాఖ అధికారి అరుణ్ కిరణ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగయ్య, గాదిరాయి సర్పంచులు పెంటకోట జగన్నాధరావు, మైసర్ల సన్యాసినాయుడు, కోట్ల జయప్పనాయుడు, తెన్నేటి రైతు ఉత్పత్తుదారులు సంఘం సీఈవో సీహెచ్ సౌమ్య, వారహి నుంచి జోనల్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, డైరెక్టర్లు, రైతులు, షేర్ హోల్డర్లు పాల్గొన్నారు.

## నివాస ప్రాంతాల్లో బెల్టు దుకాణాలపై ఫిర్యాదులు

» ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు

మాడుగుల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 23: జన నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని ఫిర్యాదులు వస్తున్నాయని మాడుగుల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ మాడుగుల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చీడికాడలో మూడు, మాడుగులలో ఐదు, రావికమతం మండలంలో ఐదు మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రా విధానంలో పాల్గొని పొందిన దక్కించుకున్న యజమానులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు జన నివాస ప్రాంతాల్లో ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. రావికమతం మండలం కొత్తకోటలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం నివాస ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగిందని, దాన్ని వెంటనే వేరే చోటకు మార్చు చేయాలని ఎమ్మెల్యే చిరంజీవి ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు అక్కడ ఏర్పాటు చేసిన దుకాణం జన నివాసానికి ఇబ్బంది కలిగించే విధంగా ఉందా? లేదా? అనే దానిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. అలాగే చీడికాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం కూడా జన నివాస ప్రాంతంలో ఉందని దానిపై వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు

» మోటార్ వాహనాల కొత్త చట్టంపై అవగాహన అవసరం

» పట్టుబడిన వాహనాల వేలంలో ఆర్టీవో మనోహర్


కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహిస్తున్న ఆర్టీవో మనోహర్

తుమ్మపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మోటార్ వాహనాల కొత్త చట్టంపై ప్రజ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్టీవో గోపికొర్ల మనోహర్ అన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఇక్కడి ఆర్టీవో కార్యాలయంలో బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలలో ఐదింటిని వేలం పాటలో ఉంచగా 32 మంది పాడుకునేందుకు పోటీపడ్డారన్నారు. వేలం పాట ద్వారా రూ.లక్షా 84వేల600 ప్రభుత్వానికి ఆదాయం చేకూరిందన్నారు. అలాగే గత రెండు వారాలుగా నిబంధనలు పాటించని వాహనాలపై పలు కేసులు నమోదు చేశామని చెప్పారు. లైసెన్స్‌లు లేని 60 వాహనాలు, ఇన్సూరెన్స్ లేనివి 151, హెల్మెట్ కేసులు 335, సీటుబెల్టు కేసులు పది, ఫిట్‌నెస్ కేసులు 132 నమోదు చేసినట్టు చెప్పారు.

అలాగే 44 వాహనాలపై ఓవర్‌లోడ్ కేసులు నమోదు చేశామన్నారు. మోటార్ వాహనాల కొత్త చట్టం ప్రకారం లైసెన్సు లేకుండా వాహనాలు నడిపే వారికి రూ. ఐదువేలు, హెల్మెట్ లేని వారికి రూ. వెయ్యి, ఆర్‌సీ లేని వారికి రూ. రెండు వేలు, ఫిట్‌నెస్ లోపించిన వాహనాలకు రూ.ఐదువేలు, ఇన్సూరెన్స్ లేని వారికి రూ. రెండు వేలు, సెల్‌ఫోన్, ట్రిపుల్ డ్రైవింగుకు రూ.1500లు అపరాధ రుసుము విధించడం జరుగుతుందని చెప్పారు. ఓవర్ స్పీడ్ వాహనాలకు రూ. వెయ్యి నుంచి రెండువేలు, ట్రాన్స్‌పోర్టు పర్మిట్ లేని వాహనాలకు రూ. పది వేలు చొప్పున అపరాధ రుసుం విధించి కేసులు నమోదు చేయనున్నట్టు చెప్పారు. వాహనదారులు తప్పక నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

## తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

గొలుగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుధారాణి మాట్లాడారు. వాతావరణ మార్పులతో వరి పైరుపై వ్యాపించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించుకోవాలని చెప్పారు. అలాగే ఎరువులు మోతాదుకు మించి వాడకూడదని చెప్పారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి పైరు పొట్ట దశలో ఉందన్నారు. దీనిపైఉంచి మండలం పరిశీలించే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చీడిగుమ్మలలో సిమెంట్ రోడ్డు నిర్మాణం

గొలుగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో తెలి విడతలో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులు బుధవారం ప్రారంభించారు. మట్టి రోడ్డుపై సిమెంట్ బుగ్గి ఏర్పాటును మండల పీఆర్ జేఈ అరుణకుమారి పరిశీలించారు. ఆదే గ్రామ పంచాయతీలో సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సుమారు 28 లక్షల రూపాయల నిధులు కేటాయించారని టీడీపీ నాయకులు బీమిరెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, కార్యదర్శి గొర తదితరులు పాల్గొన్నారు.

## యూజీసీ నెట్‌లో మన్యపురట్ల యువకుడి ప్రతిభ


జగదీశ్వరరావు

నాతవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్యపురట్ల గ్రామానికి చెందిన పువ్వలంటులు జగదీశ్వరరావు యూనివర్సిటీ గ్రాంటు కమిషన్ నెట్‌లో క్వాలిఫై ప్రతిభ కనబర్చారు. ప్రస్తుతం ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ సెకండ్ ఇయర్ చదువుతున్న జగదీశ్వరరావుకు జూన్ 14న యూనివర్సిటీ గ్రాంటు కమిషన్ నెట్ పరీక్ష రాశారు. ఈ పరీక్షలో జగదీశ్వరరావు 93 శాతం మార్కులు సాధించారు. దేశంలో ఎక్కువైనా పీజీ చేసే అవకాశం పొందాడు. జగదీశ్వరరావు టెన్త్ నాతవరం హైస్కూల్‌లో చదివి 97 శాతం మార్కులు, ఇంటర్ వెంకటగిరిలోను, డిగ్రీ ఏవీఎన్ డిసీ కర్నూలులో చదివి గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే పీజీ సెట్‌లో స్టేట్ 10వ ర్యాంక్ సాధించి ప్రస్తుతం ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ చదువుతున్నారు, జగదీశ్వరావు తల్లిదండ్రులు నాగేశ్వరావు, అర్జుల్లి మన్యపురట్ల గ్రామస్థులు అభినందనలు తెలుపుతున్నారు.

## తహసీల్దార్ నాగమ్మ బాధ్యతల స్వీకారం


బాధ్యతలు చేపట్టిన నాగమ్మ

రోలుగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట మండల తహసీల్దార్‌గా సీహెచ్.నాగమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి జిల్లా దుంబ్రిగూడ మండలం నుంచి రోలుగుంటకు బదిలీపై వచ్చారు. నెల రోజుల క్రితమే బదిలీ ఉత్తర్వులు జారీ అయినా నేటి వరకు జాయిన్ కాలేదు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా డీటీ శంకర్‌రావు బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్ నాగమ్మ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రజలు నేరుగా తనను కలసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం రీసర్వే ప్రకారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపు శిబిరం

చోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యువరత్నసింగ్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపు శిబిరం నిర్వహించారు. డాక్టర్ తేజస్విని బృందం ఆధ్వర్యంలో సిబ్బంది కాలేజీ మహిళా లెక్చరర్లు, విద్యార్థినులకు బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, డాక్టర్ వరత, మాధురి, మధు పద్మిని, లెక్చరర్లు పాల్గొన్నారు.

## రత్నంపేటలో రీ సర్వే గ్రామ సభ

రోలుగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం రత్నంపేటలో రీ సర్వే రెవెన్యూ గ్రామ సదస్సును నిర్వహించారు. వడ్డిపాలెం రెవెన్యూ గ్రామానికి సంబంధించి గ్రామ సభను రత్నంపేట గ్రామ సచివాలయంలో నిర్వహించారు. డీటీ శంకర్‌రావు, ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వివిధ భూ సమస్యలపై ఏడు దరఖాస్తులు వచ్చినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## పాల ధరలు తగ్గించడం అన్యాయం

దేవరాపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ ఆవుపాలు ధరలను తగ్గించడం అన్యాయమని జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కేవీరమణ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. లీటరుకు మూడు నుంచి ఐదు రూపాయలు తగ్గించడం చాలా దారుణమని వాపోయారు. విశాఖ డెయిరీలో పనిచేస్తున్నవారు కుబేరులు కాగా, పాడి రైతులు పేదరికంలో మగ్గిపోతున్నారన్నారు. విశాఖ డెయిరీ పునరాలోచన చేయకపోతే రైతులు ప్రతిఘటించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## 'మోహన్ కుటుంబానికి టీడీపీ అండ'

చీడికాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దారపు మోహన్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ మద్దతుతో దిబ్బపాలెం వార్డు సభ్యుడిగా గెలుపొంది గ్రామ పంచాయతీ అభివృద్ధికి చురుకైన పాత్ర పోషిస్తున్న మోహన్ (35) అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దారపు పెద్దినాయుడు, టీడీపీ జిల్లా నాయకుడు జన్నాజీ, కార్యకర్తలు పెద్దిరాజు నివాళులర్పించారు.

# కాగితంతో కళాఖండాలు







వర్షం కురిసినప్పుడు అప్పటికప్పుడు కాగితంతో పడవలు తయారుచేసి తమ ఇంటి ముందు పారే నీటిలో వాటిని వదులుతూ పిల్లలు ఆనందించడాన్ని చూస్తుంటాం. కాగితంతో పువ్వులు, ఇతర వస్తువులు తయారు చేయడం కూడా చూసే ఉంటాం. ఈ కళకు సృజనాత్మకత జోడించి కాగితపు చార్టులతో లక్షలాది రూపాయల విలువచేసే అతి ఖరీదైన కళాఖండాలు తయారుచేస్తూ విశ్వకళాకారుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు మన విశాఖ వాసి మూకా సతీశ్‌కుమార్.

**ప్రపంచ గుర్తింపు పొందిన గోపాలపట్నం వాసి మూకా సతీశ్‌కుమార్**







మూకా సతీశ్‌కుమార్

**ఒక్కోచిత్రం ఖరీదు రూ.లక్షల్లోనే...**

కాగితాలతో బొమ్మలు (పేపర్ స్కల్ప్చర్) తయారుచేయడం ఎంతో కష్టం. అటువంటి అరుదైన కళ నేర్చుకోవాలన్న తపనతో తన ఊహలకు రూపమిచ్చి కాగితపు శిల్పాలు రూపొందించి నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందారు సతీశ్‌కుమార్. ఈ కాగితపు శిల్పాలు చూస్తే ఎలాంటివారైనా అబ్బురపడతారు. మూకా సతీశ్ చేసిన కాగితపు శిల్పాలు ప్రపంచ దేశాలకు వెళుతున్నాయి. ప్రవాస భారతీయులు (ఎన్నారై) సైతం సతీశ్‌కుమార్ సృజనాత్మకతను గుర్తించి తాము ఉంటున్న దేశంలో జరిగే ఎగ్జిబిషన్‌లకు ఆహ్వానిస్తున్నారు. అమెరికాలోని తానా సభలకు కూడా సతీశ్‌కుమార్‌కు ఆహ్వానం లభించడమే ఆయన ప్రతిభకు తార్కాణం.

విశాఖలోని గోపాలపట్నానికి చెందిన మూకా సతీశ్‌కుమార్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. చిన్నతనం నుంచి కాస్త వినూత్నంగా ఆలోచించే ఆయన ఖాళీ సమయాల్లో కాగితాలను కత్తిరించి వివిధ ఆకృతుల్ని, బొమ్మల్ని తయారుచేసేవారు. ఈ తరహా కళాకారులు ఎక్కువ మంది ఉండడంతో కాస్త భిన్నంగా ఆలోచించి మందమైన కాగితపు చార్ట్‌లను దబ్బలం వంటి మందమైన చెక్కపుల్లతో అదిమి అవసరమైన చోట కత్తెర వినియోగించి బొమ్మల్ని చిత్రించడం మొదలుపెట్టారు. రాత్రింబవళ్లు తన ప్రతిభకు పదునుపెట్టడంతో అనుకున్న ఆకృతులు రూపం సంతరించుకున్నాయి. ఈ అరుదైన కాగితపు శిల్పాలు చేసే కళాకారులు ప్రపంచంలో అరుదుగా ఉన్నారని తెలుసుకున్న సతీశ్‌కుమార్ తాను చేస్తున్న ఉద్యోగాన్ని విడిచిపెట్టి పూర్తిగా కాగితపు శిల్పాలపై దృష్టిపెట్టారు. తొలుత ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో నేడు ప్రపంచంలోనే పరిమితంగా ఉన్న కళాకారుల సరసన చేరారు.

## ఖరీదైన కళాఖండాలు

సతీశ్‌కుమార్ తయారు చేసే కాగితపు శిల్పాలు ఎంతో ఖరీదైనవి. తన ఆలోచనలకు అనుగుణంగా కాగితపు శిల్పాలు తయారుచేయడానికి 50 నుంచి ఐదు వేల గంటల సమయం కూడా పడుతుందని చెబుతున్నాడు. వీటిని కొనుగోలు చేయడానికి విదేశీయులు ఆసక్తి చూపుతుంటారు. సతీశ్‌కుమార్ తయారుచేసిన ఓ కాగితపు శిల్పాన్ని రూ.12 లక్షలకు అమెరికాలోని ఓ ప్రవాసాంధ్రుడు కొనుగోలు చేశాడంటే వాటి విలువను అర్థం చేసుకోవచ్చు. చాలామంది తమకు కావల్సిన రీతిలో శిల్పాలు తయారు చేయించుకుని బహుమతులుగా ఇస్తున్నారు. నగరానికి చెందిన కొందరు బీజేపీ నేతలు ప్రధాని మోదీకి ఆయన ముఖచిత్రంతో కూడిన కాగితపు శిల్పాన్ని తయారు చేయించి బహుమతిగా అందజేశారు. సినీ నటి సమంత ఆమెలా ఉన్న కాగితపు శిల్పాన్ని రూ.1.5 లక్షలకు కొనుగోలు చేసింది.

## వీటి నాణ్యత ఎక్కువే...

సాధారణ కాగితంతో చేసే బొమ్మలు ఎక్కువ కాలం ఉండవు. కానీ ఎక్కువ కాలం మన్నడానికి ఫ్రాన్స్ నుంచి ప్రత్యేకమైన కాగితపు చార్ట్‌లను దిగుమతి చేసుకుని వాటితో శిల్పాలు తయారుచేస్తుంటారు. ఈ చార్ట్‌లతో తయారు చేసే శిల్పాలు సుమారు 200 సంవత్సరాలు ఉంటాయని సతీష్‌కుమార్ చెబుతున్నాడు.





## ఫొటో ఫ్రేమ్‌తో మరింత అందం

ఈ కాగితపు శిల్పాలను ఫొటో ఫ్రేమింగ్ చేస్తే దాని అందం రెట్టింపవుతుంది. శిల్పానికి తగిన ఫ్రేమ్, బ్యాక్‌గ్రౌండ్ ఉంచి వాటిలో ఎల్‌ఈడీలు అమరిస్తే శిల్పం చూడముచ్చటగా తయారువుతుందంటున్నారు. - గోపాలపట్నం-ఆంధ్రజ్యోతి

## రాష్ట్ర స్థాయి కత్తిసాము పోటీల్లో డీపీఎన్ విద్యార్థికి పతకం

కశింకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన అండర్- 17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీల్లో కశింకోట డీపీఎన్ పాఠశాల విద్యార్థి కోడూరు గుణశేఖర్ కాంస్య పతకం సాధించాడని ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి తెలిపారు. ఇతనిని పీడీ వేదుల ప్రభాకర్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయుల బృందం అభినందించింది.



కాంస్య పతకాన్ని సాధించిన గుణశేఖర్

## ఆస్ట్రేలియా పర్యటనలో నగర క్రికెటర్లకు చోటు

విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో పర్యటించనున్న భారత్-ఎ జట్టులో నగరానికి చెందిన యువ క్రికెటర్లు రిక్కీ భుయ్, నిశాంత్‌కుమార్ రెడ్డిలకు చోటు దక్కింది. సెలక్షన్ కమిటీ బుధవారం ప్రకటించిన 15 మంది సభ్యులతో కూడిన జట్టులో ఆంధ్రా నుంచి రిక్కీ భుయ్, నిశాంత్‌కుమార్‌రెడ్డి స్థానం దక్కించుకున్నారు. ఈ పర్యటనలో భారత్-ఎ జట్టు ఆస్ట్రేలియా-ఎతో రెండు ఫస్ట్ క్లాసు మ్యాచ్‌లు ఆడనుంది.

## యూకలిప్టస్ చెట్ల నరికివేతపై విజిలెన్స్ డీఎఫ్‌వో ఆరా

కోటవురట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాలెం నీలిగుంట అటవీ ప్రాంతంలో గల యూకలిప్టస్ ప్లాంటేషన్‌ను విశాఖపట్నం విజిలెన్స్ డీఎఫ్‌వో ధర్మరక్షిత బుధవారం పరిశీలించారు. 'అడవిపై గొడ్డలి వేటు' శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ స్పందించి విచారణకు విజిలెన్స్ డీఎఫ్‌వో ధర్మరక్షితను ఆదేశించారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ డీఎఫ్‌వో.. నర్సీపట్నం రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనర్సు, సిబ్బందితో కలిసి బుధవారం కోటవురట్ల మండలం బోడపాలెం, నీలిగుంట గ్రామాల మధ్యలో గల పట్టాలమ్మ గుడి కొండ అటవీ ప్రాంతంలోని యూకలిప్టస్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటేషన్‌లో చెట్లు నరకడం వాస్తవమేన్నారు. చెట్లు నరికిన వారిని పట్టుకునే ప్రయత్నంలో సిబ్బంది ఉన్నారన్నారు. విచారణ నివేదికను విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్‌కు అందజేస్తామని చెప్పారు.

## లక్ష్య సాధనలో ప్రథమ స్థానంలో ఉండాలి: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : లక్ష్య సాధనలో జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బందితో శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, లక్‌పతి దీదీ, ముద్ర లోన్, నారీశక్తి తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతి, శ్రీనిధి, లక్‌పతి దీదీ పథకాల ద్వారా లక్ష్యం మేరకు మెంబర్లకు లబ్ధి చేకూర్చాలని, ప్రతి ఒక్కరికి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ల్లో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవని, అమ్మకాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాల సమావేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, రక్తహీనత, రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఏపీడీ డైజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా గంగాభవానీ

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో టి.గంగాభవానీ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమె ప్యానల్ అభ్యర్థులు సైతం గెలుపొందారు. కేజీహెచ్‌లో బుధవారం ఎన్నికలు నిర్వహించారు, ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 555 మంది ఓటర్లు వుండగా 521 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో టి.గంగాభవానీ 336 ఓట్లు సాధించి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జి.వి.ఎస్ వరలక్ష్మి (319 ఓట్లు), కోశాధికారిగా బుద్దరాజు వంశీ (329 ఓట్లు), ఈసీ సభ్యులుగా ఎస్.మెహర్ శాంతి, వియ్యపు వినీలా, దాసరి లిల్లీ గ్రేస్, ఎస్.గంగాగౌరీ, టి.పద్మజ ఎన్నికయ్యారు.

### చికెన్ ధరలు

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 110.00 |
| లైవ్ ధర | 130.00 |
| విత్ స్కిన్ | 230.00 |
| స్కిన్ లెస్ | 240.00 |

### కోడి గుడ్లు (నెక్)

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 540 |
| విజయనగరం | 544 |
| శ్రీకాకుళం | 544 |


CLASSIFIEDS

**FAILED/INCOMPLETE**

★ B.Tech/Degree/Diploma ఇప్పుడు మీరు మీ డిగ్రీని ఆమోదిత విశ్వవిద్యాలయాలలో క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధనంలో పూర్తి చేయవచ్చును. ఆమోదిత సంస్థ - ప్రభుత్వ ఉద్యోగాలకు వర్తించును. సం॥ప్ర॥ 8330964279.

AJW-199039

**EDUCATION**

★ **Distance / Online** Degree, PG, MBA, MCA, B.Tech., etc. Courses Admissions in Govt. and UGC approved Universities with pass guidance and Low Fees. Call: 7997296796

AJV_192599

For Advertisement Contact :
9963231176
9966165093

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి


# టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యం 3.5 లక్షలు

» ఈ నెల 26 నుంచి అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభం

» పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3.5 లక్షల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు. బుధవారం ఇక్కడ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలు నమోదు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సభ్యత్వం కోసం రూ.100 చెల్లించాలని, సభ్యత్వం పొందిన వారికి ఇన్సూరెన్స్ పాలసీని పార్టీ చెల్లిస్తుందని తెలిపారు. ప్రమాదంలో కార్యకర్త మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. పదవులు పొందేందుకు సభ్యత్వ నమోదు తప్పనిసరి అని అన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో 15 మందితో కూడిన బృందాలను సభ్యత్వ నమోదు పర్యవేక్షణకు నియమిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకులు కె.నర్సింగరావు, బి.జోగినాయుడు, బి.మురళి, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా హాకీ జట్ల ఎంపిక పోటీలు ప్రారంభం



జిల్లా స్థాయి హాకీ సెలక్షన్స్‌కు హాజరైన క్రీడాకారులు

నక్కపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్ -14 బాలబాలికల హాకీ జట్ల ఎంపిక శిబిరాన్ని బుధవారం నక్కపల్లిలోని టీఎస్ హాకీ క్లబ్ మైదానంలో ప్రారంభించారు. బుధ, గురువారాల్లో జరిగే ఈ ఎంపిక పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక పాఠశాలల నుంచి సుమారు 360 మంది హాకీ క్రీడాకారులు తరలివచ్చారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 8, 9, 10 తేదీల్లో నక్కపల్లిలో నిర్వహించే అంతర్ జిల్లాల అండర్ -14 హాకీ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.

## మద్యం షాపుల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

» ఎక్సైజ్ సీఐ తేజో వెంకటకుమార్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ తేజో వెంకటకుమార్

ఎలమంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్యం దుకాణాలను బుధవారం ఎక్సైజ్ సీఐ తేజో వెంకటకుమార్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని దుకాణ నిర్వాహకులను హెచ్చరించారు. 'ఎలమంచిలిలో ఓపెన్ బార్లు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మద్యం దుకాణాలతోపాటు పట్టణంలోనిఇ పలు దుకాణాలను పరిశీలించారు. దుకాణాలను ఆనుకుని ఉన్న పాన్‌షాపుల నిర్వాహకులను విచారించి బైండోవర్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లూజు సేల్స్, గ్రామాల్లో అనధికారిక వేలం పాటలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మెగా వాటర్ ప్రాజెక్టులో కదలిక

... 5వ పేజీ తరువాయి

నీటి సరఫరాను ప్రారంభించారు.

**అటకెక్కించిన వైసీపీ పాలకులు**

మెగా వాటర్ ప్రాజెక్టు రెండో దశ (వాటర్ గ్రిడ్) పనులకు టెండర్లు పిలిచే తరుణంలో ఎన్నికలు జరిగి, వైసీపీ అధికారంలోకి వచ్చింది. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను నీరుగార్చాలన్న ఉద్దేశంతో మెగా వాటర్ ప్రాజెక్టు పనులను గాలికొదిలేసింది. తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిన వాటర్ గ్రిడ్‌ను రద్దు చేసింది. మళ్లీ రెండేళ్ల క్రితం వాటర్ గ్రిడ్ మంజూరు చేసినప్పటికీ నిధులు మాత్రం మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో మే నెలలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమిచెంది, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పాయకరావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వంగలపూడి అనిత హోం మంత్రి అయ్యారు. గతంలో తన హయాంలో పురుడుపోసుకున్న మెగా వాటర్ ప్రాజెక్టును మళ్లీ తన హయాంలోనే పూర్తి చేయాలని భావించారు. జాతీయ గ్రామీణ తాగునీటి పథకం నిధుల నుంచి తొలివిడత రూ.24 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో పాయకరావుపేట మండలంలో 13 గ్రామాలకు పైపులైన్లు వేసి, తాగునీటిని సరఫరా చేస్తారు. ఇప్పటికే పనులు ప్రారంభం అయ్యాయి. వచ్చే వేసవి నాటికి పనులు పూర్తి చేసి, ఈ 13 గ్రామాలకు రక్షిత తాగునీటిని అందిస్తామని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

కాగా మెగా వాటర్ ప్రాజెక్టును పూర్తి చేయించి, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో మిగిలిన గ్రామాలకు, ఎస్.రాయవరం మండలంలో అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి కోరనున్నట్టు మంత్రి అనిత 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

## వరిపై తెగుళ్ల దాడి

... 5వ పేజీ తరువాయి

మందును రెండు మిల్లీలీటర్లు, లేదా ప్రొపికోనజోల్ మందు ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి ఆకులన్నీ తడిసేలా పిచికారీ చేయాలి.

తెల్లచిత్త: ఈ తెగులు నివారణకు కెల్థాన్ మందును లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ: ముందుగా వరినాట్లు వేసిన పొలాల్లో సుడిదోమ ఎక్కువగా కనిపిస్తున్నది. సుడిదోమ ఆశించిన పొలంలో తొలుత నీరు మొత్తాన్ని బయటకు పంపాలి. తరువాత బుప్రోఫిజిన్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ మందును లీటరు నీటికి 1.5 గ్రాముల చొప్పున కలిపి వరి దుబ్బుల మొదళ్ల వద్ద పిచికారీ చేయాలి. దోమ ఉధృతి అధికంగా ఉంటే డైనెటోఫ్యూరాన్ అనే పొడి మందును ఒక లీటరు నీటికి 0.4 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి

## నకిలీ వరి విత్తనాలతో నష్టపోయాం

... 5వ పేజీ తరువాయి

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటవురట్ల ఆర్‌బీకే (ప్రస్తుతం రైతు సేవా కేంద్రం)లో ఏవో అందుబాటులేకపోవడంతో సిబ్బందికి ఫిర్యాదు చేసినట్టు బాధిత రైతులు అంగంరెడ్డి కృష్ణ, పేరూరి చిట్టిబాబు, రమణ, వీరబాబు, బాబురావు, నిమ్మలకృష్ణ తెలిపారు. ఏవో స్పందించలేదని, సిబ్బంది మొక్కుబడిగా వచ్చి వరి పంటను పరిశీలించి వెళ్లిపోయారన్నారు. పంట మొత్తం ఒకేసారి ఈనకపోవడంతో అనుమానం వచ్చిందని చెప్పారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని, కేళీల కారణంగా ధాన్యం ఎవరూ కొనుగోలు చేయరని వాపోయారు. కాగా తమ పరిశీలనలో కేళీలు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామని, ఈ విషయాన్ని ఏపీ సీడ్స్ కంపెనీ జిల్లా మేనేజర్‌కు తెలియపరిచామని వ్యవసాయ శాఖ సహాయకుడు మధు తెలిపారు.

# క్రైం... crime news

## టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

నర్సీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని శారదానగర్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. శారదానగర్‌లో నివాసం ఉంటున్న సుర్ల సత్యనారాయణ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఇతని కుమార్తె మేరీ క్రిస్టియానా ఒక ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నది. ఈమె ఏడాది నుంచి మైగ్రేన్ తలనొప్పితో బాధ పడుతున్నది. కొద్దిరోజులుగా తలనొప్పి తీవ్రతరం కావడంతో వారం రోజుల నుంచి పాఠశాలకు వెళ్లడంలేదు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం మేరీని ఇంట్లో ఉంచి ఆమె తల్లి ఆస్పత్రికి వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో మేరీ చీరతో ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

## దివ్యాంగ బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయికి మూడేళ్లు జైలు శిక్ష

రోలుగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలు అయిన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముద్దాయికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ విశాఖ పోక్సో కోర్టు తీర్పు చెప్పినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. 2014 జూలై ఆరో తేదీన రోలుగుంట మండలం జేపీ అగ్రహారం గ్రామంలో దివ్యాంగురాలైన బాలికను, కాకర దాసు అనే మోటారు మెకానిక్ మాయమాటలతో తన ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక ఏడుస్తూ ఇంటికి వచ్చి కడుపులో నొప్పి వస్తున్నదంటూ ఏడుస్తూ సైగలతో అమ్మమ్మకి చెప్పింది. దీంతో బాధితరాలు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాసిక్యూషన్ మోపిన అభియోగం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. సొమ్మును బాధిత కుటుంబానికి చెల్లించాలని ఆదేశించారు. పీపీ కరణం కృష్ణ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

## యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయరామరాజుపేటకు చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు.. విజయరామరాజుపేటకు చెందిన పిల్లల సురేశ్ మెయిన్‌రోడ్డులో వస్త్ర వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో షాపు మూసివేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## మరదలిపై అత్యాచారం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

ఎలమంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మరదలిపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఎలమంచిలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎలమంచిలిలోని ధర్మవరం సీపీ పేటకు చెందిన బంగారు వెంకీకి భార్య, కుమార్తె ఉన్నారని, భార్యకు కాన్పు కావడంతో ఆమెకు సహాయంగా చెల్లెలు వచ్చిందన్నారు. అయితే ఆ బాలికపై వెంకీ అత్యాచారం చేశాడని, విషయం బయటకు చెబితే అక్కను చంపేస్తానని బెదిరించాడని తెలిపారు. బాధితురాలి కుటుంబ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేయడంతో నిందితుడిని బుధవారం అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

## కానరాని సమస్యల పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

ఉండడం లేదు. పరవాడ మండలం తానాం గ్రామంలో జల వనరుల శాఖ చేపట్టాల్సిన పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం చేపట్టడం, అందుల్లో నాణ్యత లేకపోవడంపై జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు ఏడాది నుంచి ప్రస్తావిస్తూనే ఉన్నారు. బహుశా గురువారం సమావేశంలోనూ చర్చించే అవకాశం ఉంది. అనంతగిరిలో క్షతగాత్రులను ఎస్.కోట నుంచి విశాఖకు తరలించాలని, విజయనగరం ఆస్పత్రికి వద్దని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు రెండేళ్ల నుంచి కోరుతున్నా ఇంతవరకూ పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో రోడ్ల దుస్థితి, ఇసుక సరఫరా, ఖరీఫ్‌కు నీటి విడుదల వంటి అంశాలపై గురువారం నాటి సమావేశం దృష్టిసారించాలని పలువురు సభ్యులు కోరుతున్నారు. సమస్యలపై మాటలతో సరిపెట్టకుండా పరిష్కారం అయ్యే దిశగా చొరవ తీసుకోవాలంటున్నారు.

## సైబర్ మోసగాళ్ల ఉచ్చులో గృహిణి

... 5వ పేజీ తరువాయి

పంపించింది. కానీ అటు వైపు నుంచి ఆమె ఖాతాలో డబ్బులు పడడం లేదు. అకౌంట్ ఫ్రీజ్ అయినట్టు చూపిస్తున్నదని ఆమెకు మెసేజ్ పెట్టారు. మరో రూ.లక్ష పంపితే రూ.1.8 లక్షలు పంపిస్తామని మెసేజ్ పంపారు. తన వద్ద డబ్బులు లేకపోవడంతో ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి రూ.1.5 లక్షలు తీసుకుంది. తెలిసిన వారి వద్ద రూ.50 వేలు అప్పు తీసుకుంది. ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సైబర్ నేరగాళ్ల చెప్పినట్టు పది బ్యాంక్ ఖాతాలకు రూ.3.79 లక్షలు పంపించింది. బోనస్‌తో కలిపి తన డబ్బులు పంపాలని మెజేజ్ పెట్టింది. అయితే అకౌంట్ ఫ్రీజ్ అయిందని, మీ బ్యాంకు ఖాతాకి డబ్బులు జమకావడం లేదని గ్రూపులో మేసేజ్ రావడంతో మోసపోయినట్టు గ్రహించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.